మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## తారా కళాశాలను సందర్శించిన న్యాక్ బృందం

**సంగారెడ్డి టౌన్, మార్చి 27, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని తారా ప్రభుత్వ కళాశాల (ఏ)ను సోమవారం న్యాక్ బృంధం సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెఎస్ఎస్ రత్న ప్రసాద్ తెలిపారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం బృంధం సభ్యులు కళాశాలకు చేరుకున్నట్లు పేర్కొన్నారు. ప్రతి డిగ్రీ కళాశాలలో విద్యా ప్రమాణాలను పరిశీలించి కళాశాలలకు గ్రేడ్‌లు కేటాయిస్తారని, ప్రతి 5 సంవత్సరాలకు ఒక మారు న్యాక్ బృంధం కళాశాలలను సందర్శి స్తుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. పీక్‌టీం చైర్మన్‌గా పద్మావతి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ దుర్గా భవాని వీరమాచినేని, కార్యదర్శిగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రొఫెసర్ మధుమం గత్‌పాల్, సభ్యులుగా తమిళనాడుకు చెందిన విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్‌పి రామలింగం ఉన్నార న్నారు. ఈ సందర్భంగా న్యాక్ బృంధం సభ్యులు కళాశాల పూర్వ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొనపూర్ సర్పంచ్‌కు సతత్ వికాస్ అవార్డు



అవార్డును అందచేస్తున్న మంత్రి హరీష్‌రావు

**సదాశివపేట, మార్చి 27, ప్రభాతవార్త:** కొనపూర్ సర్పంచ్ గోపులరాం శోభారాణి మంత్రి తన్నీరు హరీష్‌రావుతో సతత్ వికాస్ అవార్డును సోమవారం అందుకున్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి హరీష్‌రావు కొనపూర్ సర్పంచ్ దంపతులకు శాలువాతో సత్కరించి అవార్డును అందచేశారు. కార్యక్రమంలో టిఎస్‌హెచ్‌డిసి చైర్మన్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ శరత్, జిల్లా పరిషత్ చైర్మన్ మంజుశ్రీ జయపాల్‌రెడ్డి, ఎంపిపి అధ్యక్షులు యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.





మున్సిపల్ కార్యాలయంలో బడ్జెట్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

## మున్సిపల్ ఆదాయ వనరులను పెంచుకోవాలి

**అడిషనల్ కలెక్టర్ ముజామిల్‌ఖాన్**

**గజ్వేల్, మార్చి 27 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అభివృద్ధికి ఆదాయ వనరులను పెంచుకోవాలని సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ ముజామిల్‌ఖాన్ పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి అధ్యక్షతన 2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ ముజామిల్‌ఖాన్ మాట్లాడుతూ మున్సిపల్ ఆదాయ వనరులను పెంచుకున్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ 2023-24 సంవత్సరం బడ్జెట్ అంచనా 240.84 కోట్లతో మరియు మిగులు బడ్జెట్ 65.40 లక్షలతో ప్రవేశపెట్టగా ఇందులో మున్సిపల్ సొంత ఆదాయ వనరుల అంచనా 13.52 కోట్లు, గ్రాంట్ల ద్వారా ఆదాయ అంచనా 227.32 కోట్లు అని తెలిపారు. ఇందులో గ్రీన్ బడ్జెట్ 1.45 కోట్లు, 1/3వ వంతు బడ్జెట్ కొత్తగా విలీనమైన ప్రాంతాలలో కిష్టమైన మౌలిక సదుపాయాల అవసరాలు, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు, బలహీన వర్గాల మైనార్టీలు మరియు మురికివాడలు నివసించే ప్రాంతాలకు 0.8 కోట్లు బడ్జెట్‌లో ప్రవేశపెట్టారు. అనంతరం పాలకవర్గ సభ్యులందరూ బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఇట్టి బడ్జెట్ రూపకల్పన చేసినందుకు గానూ అడిషనల్ కలెక్టర్ ముజామిల్‌ఖాన్ మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణను, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ డి.రాకేశ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జకియొద్దీన్‌తో పాటు పాలకవర్గ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## మూడో సారి హ్యాట్రిక్ సాధించాలి

**మంత్రి హరీష్‌రావు**





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు

**నారాయణఖేడ్, మార్చి 27 ప్రభాతవార్త:** ముచ్చటగా మూడో సారి హ్యాట్రిక్ సాధించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరిష్‌రావు అన్నారు. సోమవారం నారాయణఖేడ్ పట్టణంలోని హెచ్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి హరిష్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ముచ్చటగామూడోసారి హ్యాట్రిక్ విజయం సాధించాలని బిఆర్ఎస్ నాయకులకు,కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నారాయణఖేడ్ ప్రాంతంలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ప్రజల ఓట్లు దండుకున్నారే తప్ప అభివృద్ధి చేయలేదని అన్నారు. నారాయణఖేడ్ ప్రాంతంలో గతంలో విద్యార్థులు చదువుకునేందుకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారు తెరాస ప్రభుత్వం ఏర్పాడిన తర్వాత నారాయణఖేడ్ ప్రాంతంలో రెండు గిరిజన గురుకుల పాఠశాలలు,రెండు బీసీ గురుకుల పాఠశాలలు, మైనార్టీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి విద్యను అందిస్తున్న ఘనత మన బిఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. మన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ హయంలో రైతుల కొరకు అనేక సంక్షేమ పథకాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకుంటున్నామన్నారు. మహారాష్ట్ర లోని షోలాపూర్‌లో ప్రాంత ప్రజలకు బిజేపీ ప్రభుత్వం నాలుగురోజులకో మారు తాగునీటిని అందిస్తుందన్నారు. అదే మన తెలంగాణ రాష్ట్రంలో ప్రతి గ్రామానికి మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటికింటికి రోజు ఉదయం తాగునీటిని అందిస్తున్నామన్నారు. నారాయణఖేడ్ ప్రాంతంలో నూతనంగా నాలుగు గిరిజన గురుకుల పాఠశాల నిర్మాణం కోసం రూ.16 కోట్లు మంజూరు చేసి విద్యార్థులు చదువుకునేందుకు ఈ మధ్యకాలంలోనే ప్రారంభించామన్నారు. నారాయణఖేడ్ ప్రాంతంలోని రైతులు పంటలు పండించుకునేందుకు లిఫ్ట్ఇరిగేషన్ ద్వారా బోరంచలో బసవేశ్వర పథకం ప్రారంభించామన్నారు. బిజేపీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి నిధులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తుందని దీనికి తోడు ఎమ్మెల్యేలను కొనుగోలు, ఈడీ ఇన్కమ్ ట్యాక్స్ కేసులను ప్రయోగిస్తుందని ఏన్ని చేసిన బిఆర్ఎస్ పార్టీ భయపేది లేదని కేసీఆర్‌ను తెలంగాణ ప్రజలు గుండెల్లో దాచుకున్నారని ప్రతి ఇంటికి బిఆర్ఎస్ సర్కారు సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు.

### ఖేడ్‌లో 50 పడకల ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రి హరీష్‌రావు

నారాయణఖేడ్‌లో పట్టణంలో నూతనంగా నిర్మించిన రూ.1100 లక్షలతో నిర్మించిన మాత శిశు ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర ఆర్థిక, వైద్యఆరోగ్య శాఖ మంత్రి హరిష్‌రావు చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరిష్‌రావు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు ఈ సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి, దర్మారెడ్డిఎమ్మెల్యే ,కలెక్టరు డాక్టరు శరత్,జడ్పీచైర్మన్ మంజూశ్రీ జైపాల్‌రెడ్డి, ఆర్డీఓ అంబాదాస్, తహశీల్దార్ మురళీ, జడ్పీటీసీలు, ఎంపీపీలు, మున్సిపల్ ఛైర్మన్ రుబినా నజీబ్, వైస్ చైర్మన్, పరశురాం, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పరమేష్, నాయకులు పాల్గొన్నారు.

# అన్ని మున్సిపాలిటీలకు సిద్దిపేట ఆదర్శం

**జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్**



మున్సిపల్ వార్షిక బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొత్త జిల్లాలు, మున్సిపాలిటీలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందని..కొత్త పాత మున్సిపాలిటీలకు సిద్దిపేట మున్సిపాలిటీ ఒక అదర్శమని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీలో చైర్మన్ కడవెర్గు మంజులరాజనర్సు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన వార్షిక బడ్జెట్ సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ పాలక వర్గం అధికారులు కలిసి కట్టుగా పని చేసి మంత్రి హరీష్‌రావు అభివృద్ధిలో మీ వంతు పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మున్సిపల్ అభివృద్ధికి ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మంత్రి హరీష్‌రావు సహకారంతో సిద్దిపేట పట్టణం చుట్టూ వాటర్ రింగ్ పైప్ లైన్ తొందరలోనే ప్రారంభించుకోవడం జరుగుతుందన్నారు. సిద్దిపేట మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలను సైతం అభివృద్ధి చేసుకోవాలన్నారు. సిద్దిపేట పట్టణ మున్సిపాలిటీ అన్ని రంగాల్లో ఎప్పుడు మొదటి స్థానంలో ఉండాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ ముజామిల్‌ఖాన్, చైర్మన్ కడవెర్గు మంజులరాజనర్సు తదితరులు మాట్లాడారు.2020-24 సంవత్సరానికి గానూ 124 కోట్ల 54 లక్షల 88 వేల రూపాయాల బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా పాలక వర్గం సభ్యులు అమోద ముద్రవేశారు. అనంతరం మున్సిపల్ పాలకవర్గం సభ్యులు ఎజెండాలో పొందుపర్చిన అంశాలను అమోదించారు. సమావేశంలో ఏసీపీ చల్లా దేవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, కమిషనర్ సంపత్‌కుమార్, మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు ధర్మవరం బ్రహ్మం, నాగరాజురెడ్డి, గుండ యోగి, కలకుంట్ల మల్లికార్జున్, నాయకం లక్ష్మణ్, వంగ రేణుక తిరుమల్‌రెడ్డి, శ్రీదేవి బుచ్చిరెడ్డి, వరల కవితసురేష్ తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర ప్రభుత్వ కక్ష సాధింపు చర్యతోనే

# రాహుల్‌గాంధీపై వేటు

**ఉమ్మడి మెదక్ జిల్లా పార్లమెంట్ ఇంచార్జి జగదీష్**



సత్యాగ్రహ సంకల్ప దీక్షలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే రాహుల్‌గాంధీపై వేటు విధించిందని ఉమ్మడి మెదక్ జిల్లా పార్లమెంట్ ఇంచార్జి జగదీష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ముస్తాబాద్ చౌరస్తాలో సోమవారం పట్టణ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) అధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సత్యాగ్రహ సంకల్ప దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా అయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి సర్కారు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారని రాహుల్‌గాంధీ వైపే దేశం మొత్తం ఎదురు చూస్తుందన్నారు. మోడీ అధికారం ఉందనే అహంకారంతో రాహుల్‌గాంధీపై లేనిపోని అభి యోగాలు మోపుతూ న్యాయ వ్యవస్థను సైతం తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో బిజెపిని బొంద పెట్టడం ఖాయమన్నారు. రాహుల్‌గాంధీ చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రకు ప్రజల నుంచి వచ్చిన స్పందన చూసి ఓర్వలేకనే తప్పుడు కేసు బనాయించి ఎంపిగా అనర్హత వేటు వేశారన్నారు. పార్లమెంటు సమావేశాల్లో అదాని అక్రమ సంపాదనపై నిలదీస్తుంటే కేంద్రం ఎందుకు మౌనంగా ఉంటుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే దేశం అన్ని రంగాలల్లో అభివృద్ధి చెందడంతో పాటు ప్రతి పేద వాడికి న్యాయం జరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి తీరుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గూడూరి శ్రీనివాస్(ఎస్టీడి), కత్తి కార్తీక, డాక్టర్ లక్కరసు సూర్యచంద్రవర్మ, అంక్షరెడ్డి, గంప మహేందర్‌రావు, సొప్పదండి చంద్రశేఖర్, షాబుద్దీన్, బిక్షపతి, గణేష్, సతీష్‌గౌడ్, మమతారెడ్డి, పద్మ, నర్సవ్వ, స్వప్న, అనిల్, రఘుపతి, అశోక్‌గౌడ్, రామచంద్రం, శంకర్,రాములు, నర్సారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వంగరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికీ కష్టం విలువ తెలవాలి : సీపీ



ఎన్‌సీసీ క్యాండెట్లకు అప్రిసియేషన్ సర్టిఫికెట్లు అందిస్తున్న సీపీ శ్వేత

**కొమురవెల్లి, మార్చి 27, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరికి కష్టం విలువ తెలవాలని..ఎన్‌సీసీ క్యాండెట్లు ఏ రంగంలోనైనా రాణించి ఉత్తమ సేవలు అందించడం జరుగుతుందని సీపీ శ్వేత అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా 9 అదివారాలు సిద్దిపేట, గజ్వేల్‌కు చెందిన ఎన్‌సీసీ క్యాండెట్‌లు 170 మంది నిరంతరంగా ట్రాఫిక్, క్యూలైన్, గర్భగుడి, ఎల్లమ్మ టెంపుల్, పెద్దపట్నం, చిన్న పట్నం తదితర ప్రదేశాలలో క్రమ శిక్షణతో విధులు నిర్వహించడం జరిగిందన్నారు. సోమవారం స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా విధులు నిర్వహించిన ఎన్‌సీసీ క్యాండెట్లకు అమె అప్రిసియేషన్ సర్టిఫికెట్లు, చిరు కానుక అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ఎన్‌సీసీ సేవలు అమోఘమని..క్రమ శిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ అన్నారు. ఎన్‌సీసీ క్యాండెట్ల సేవలు దేశంలో, రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలు, ఎన్నికల సమయంలో బందోబస్తు వివిధ అలయాల్లో బ్రహ్మోత్సవాలు జరిగినప్పుడు వినియోగించుకోవడం జరుగుతుందన్నారు. ఎన్‌సీసీ యొక్క విధి విధానాలు, క్రమశిక్షణ చాల ముఖ్య పాత్ర వహిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతలు విధులు తెలిసి ఉండాలన్నారు. ఎన్‌సీసీ ద్వారా మనిషికి క్రమశిక్షణ, చట్ట ప్రకారం ఎలా నడుచుకోవాలి, దయా, కరుణ అలవాటు పడతాయన్నారు. మల్లికార్జున స్వామి అశీస్సులు మన అందరిపై ఉంటాయన్నారు. అందరి సహకారంతో మల్లన్న స్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా జరుపుకోవడం జరిగిందన్నారు. ప్లాస్టిక్‌ను ప్రతి ఒక్కరూ నిషేధించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సందెపొగు మహేందర్, చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి, అర్ఐ అడ్మిన్ శ్రీధర్‌రెడ్డి, ఎస్‌బి సీఐ శ్రీధర్, కొమురవెల్లి ఎస్ఐ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# స్వరాష్ట్రంలో అన్ని వర్గాల వారికి సమన్యాయం

**మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**





ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**నిజాంపేట, మార్చి 27, ప్రభాతవార్త :** నిజాంపేట మండల కేంద్రంలో సోమవారం రోజున బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయసమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మెదక్ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంగు మల్లేశం హాజరయ్యారు. ఈ మేరకు మండల బీఆర్ఎస్ నాయకులు గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటగా కేసీఆర్ సందేశాన్ని ఎమ్మెల్యే ప్రజలకు చదివి వినిపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సంక్షేమ అభివృద్ధితో పాటు తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. నిజాంపేట మండలం ఏర్పడ్డాక అనేక అభివృద్ధి పనులతో పాటు అభివృద్ధి పథంలో మందుకు దూసుకెళ్తుందన్నారు. మండలానికి కళ్యాణలక్ష్మి పథకం కింద వెయ్యి 74 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం మోటార్లకు మీటర్లు బిగిస్తానని నరేంద్రమోడీ ప్రకటిస్తే ముఖ్యమంత్రి కేసీఆర్ ఒప్పుకోకుండా తెలంగాణ రైతాంగానికి ఉచిత విద్యుత్ అందిస్తుందన్నారు. అదేవిధంగా ఇల్లులేని నిరుపేదలకు ఖాళీ స్థలం ఉన్నవారికి మూడు లక్షల రూపాయలను ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే లబ్దిదారులకు అందజేస్తుందని ఆమె అన్నారు. ఎక్కడ కాళేశ్వరం ఎక్కడ నిజాంపేట 600 మీటర్ల లోతులో ఉన్న కాళేశ్వరం నీటిని కాలువల ద్వారా నిజాంపేట మండలంలోని 19వేల ఎకరాలకు నీరు అందిస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వాల కంటే తెలంగాణ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు రైతుబంధు, రైతుబీమా, ఆసరాపించన్లు, కళ్యాణలక్ష్మి తదితర పథాకలను కేటాయించి దేశంలోనే నెంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు. రానున్న రోజుల్లో పద్మాదేవేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కార్యకర్తలకు మెదక్ నియోజకవర్గ ఇంచార్జి ఎంగు మల్లేశం పిలుపునిచ్చారు. అనంతరం నస్కల్ రోడ్డు బాగోలేనందున 12.5 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, మండల ఎంపిపి దేశెట్టి సిద్దరాములు, వైస్ ఎంపిపి అందె ఇందిరా కొండల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు సుధకర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు అనూష, ప్రీతి, కవిత, అరుణ్, గేమ్ సింగ్, ఎంపీటీసీలు బాల్‌రెడ్డి, సురేష్, సొసైటీ చైర్మెన్లు బాపురెడ్డి, అందె కొండల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, యూత్ అధ్యక్షులు రాజు, ఉపసర్పంచ్ బాబు, కో ఆప్షన్ సభ్యులు గౌస్, బీఆర్ఎస్ నాయకులు అబ్దుల్ అజీజ్, సత్యనారాయణ, ఆకుల మహేష్‌తో పాటు కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు

**ప్రజాప్రతినిధులు, అధికారులు**

## సమిష్టి కృషితో గ్రామాల అభివృద్ధి

**మంత్రి హరీష్‌రావు**

**సంగారెడ్డి, మార్చి 27, ప్రభాతవార్త:** ప్రజాప్రతినిధులు, అధికారుల సమిష్టి కృషితో గ్రామాలు అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు అన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ (2021-22) అవార్డుల కార్యక్రమంలో భాగంగా సోమవారం కులబ్‌గూర్ జిఆర్‌కె ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా స్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీలుగా ఎంపికైన గ్రామపంచాయతీలకు మంత్రి హరీష్‌రావు అవార్డులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని 17 గ్రామ పంచాయతీలు 9 కేటగిరీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి 27 జిల్లా స్థాయి అవార్డులు అందుకోవడంపై సంతోషం వ్యక్తం చేస్తూ సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులను అభినందించారు. తెలంగాణలోని ప్రతి పల్లెకు ఇంటింటికి ప్రతిరోజు నీరు వస్తుందని, 24 గంటల కరెంటు ఇస్తున్నామని, రైతులకు ఏం కావాలో సీఎం అది చేస్తున్నారన్నారు. తెలంగాణ దేశానికి మోడల్‌గా మారిందన్నారు. ఇతర రాష్ట్రాలలో తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. వడగళ్ల వానతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల సాయం చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారన్నారు. ప్రధానమంత్రి సంసద్ యోజన పథకంలో 10 ఉత్తమ గ్రామ పంచాయతీలు తెలంగాణ గ్రామ పంచాయతీలేనని తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి ఏ నిధులైనా నేరుగా గ్రామ పంచాయతీ అకౌంట్లలో జమ చేస్తామని మంత్రి చెప్పారు. పనిచేసిన వెంటనే బిల్లులు చెల్లించుకునే అవకాశం మీకే కల్పించామన్నారు. గతంలో సర్పంచులకు కాలిపోయిన మోటర్లకు రిపేర్ చేయించడం, బోర్లను వేయించడంతోనే 5 సంవత్సరాల కాలపరిమితి పూర్తయ్యేదన్నారు. తెలంగాణ వచ్చాక నీళ్ల గోల లేదు, కరెంటు సమస్య లేదన్నారు. రాబోయే రోజుల్లో సంగారెడ్డి జిల్లాకు రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు రావాలని మంత్రి హరీష్‌రావు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ ఛైర్మన్ చింతా ప్రభాకర్, ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, క్రాంతి కిరణ్, జిల్లా కలెక్టర్ డా.శరత్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్‌డిఓ శ్రీనివాస్‌రావు, జడ్పీటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, ఎంపిడిఓలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో కాంగ్రెస్ సత్యాగ్రహ దీక్ష



సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు తూర్పు నిర్మలరెడ్డి

**సంగారెడ్డి టౌన్, మార్చి 27, ప్రభాతవార్త:** రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ రాజకీయ లబ్ధికోసం భారతీయ జనతా పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ టిపిసిసి పిలుపు మేరకు సోమవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు తూర్పు నిర్మలరెడ్డి ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్షను నిర్వహించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్‌కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సత్యాగ్రహ దీక్షను ఉద్దేశించి నిర్మలారెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్‌లు మాట్లాడుతూ కేంద్రం స్వలాభం కోసం రాజ్యాంగాన్ని ఉల్లగిస్తోందన్నారు. పార్లమెంట్‌లో అవినీతికి పాల్పడిన ఆదాని అంశంపై వాదిస్తే ఇలాంటి చర్యలు తీసుకోవడం సమాజానికి నష్టం కల్గించడం కాదా అని వారు ప్రశ్నించారు. రాహుల్ గాంధీపై కక్ష పూరితంగా ఎంపి సభ్యత్వానికి వేటు వేయడం తగదని వారు హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి ఉత్తమ పంచాయతీగా చీక్‌మద్దూర్



అవార్డులను అందజేస్తున్న మంత్రి హరీష్‌రావు

**హత్నూర మార్చి 28,ప్రభాతవార్త:** జాతీయ పంచాయతీ ఆవార్డులలో హత్నూర మండలం చీక్‌మద్దూర్ గ్రామపంచాయతీ జిల్లాస్థాయి ఉత్తమపంచాయతీ ఆవార్డుకైవసం చేసుకుంది. సోమవారం సంగారెడ్డిలో జరిగిన జిల్లా స్థాయి అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీష్‌రావు ముఖ్య అతిథిగా హజరై అవార్డులను ఆయా గ్రామాల సర్పంచ్‌లకు అందజేశారు.దీన్‌దయాల్ ఉపాధ్యా పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్, జాతీయ పంచాయతీ అవార్డులు 2021=22 అవార్డులకు సంగారెడ్డి జిల్లాలోని 27గ్రామపంచా యతీలు ఎంపికయ్యాయి.అందులో హత్నూర మండలం చీక్‌మద్దూర్ గ్రామపంచాయతీ ఎంపికైంది.ఉత్తమ పంచాయతీ ఆవార్డును మంత్రి హరీష్‌రావు, గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిటిసి ప్రవీణశ్రీనివాస్‌రెడ్డిలకు శాలువాలతో సత్కరించి, ఆవార్డులను అందజేశారు.



నూతన రథం ఆవిష్కరణ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

## ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే

**పెద్దశంకరంపేట, మార్చి 27 ప్రభాతవార్త:** దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలోని రామాయలయంలో నూతన రథం ఆవిష్కరణలో పాల్గొన్నారు. ఆసూరి శేషాచారి, విజయలక్ష్మీ దంపతుల జ్ఞాపకార్థం కుమారులు రామచంద్రచారి, వేణుగోపాల్ చారి, మురళి పంతులు రూ. 15 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన రథాన్ని ఆలయానికి ఇవ్వడం అభినందనీయమన్నారు. రామాలయం పునర్నిర్మాణానికి దేవాదాయ శాఖ నుండి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. రథ ప్రతిష్ట మహోత్సవంలో వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్ఛరణల మధ్య గణపతి పూజ, హోమాలు, రథ ప్రతిష్ట హోమం, రథ ఆవిష్కరణ కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, సర్పంచి సత్యనారాయణ, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మురళీ పంతులు, రామాలయ కమిటీ అధ్యక్షులు గుజ్జరి కనకరాజు, కమిటీ సభ్యులు విగ్రం వేణుగోపాల్‌గౌడ్, ఆర్ఎన్. సంతోష్ కుమార్, రాగం సిద్ధేశ్వర్, శ్రీనివాస్, దాదిగారి గంగాధర్, కందుకూరి రవీందర్, సుభాష్‌గౌడ్, సర్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## 29న టిడిపి జెండాను ఆవిష్కరించాలి

**-పార్లమెంట్ పరిశీలకులు గంగాధర్‌రావు**



మాట్లాడుతున్న గంగాధర్‌రావు

**మెదక్ మున్సి పాలిటీ, మార్చి 27 ప్రభాతవార్త:** ఈ నెల 29వ తేదీన తెలుగుదేశం పార్టీ 41వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మెదక్‌లో సోమవారం పార్లమెంట్ పరిశీలకులు ఏకే. గంగాధర్‌రావు ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర్ రావు మాట్లాడుతూ ఈనెల 29న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో టిడిపి జెండాను ఆవిష్కరించాలన్నారు. మార్చి 29న టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు పార్టీ ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. సభకు జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు అఫ్జల్, లక్ష్మణ్ యాదవ్, కరీం, బొజ్జ పవన్ పాల్గొన్నారు.

## ఇంటింటికీ టిడిపి



టిడిపి జెండా ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ కోఆర్డినేటర్ వెంకటరమణ

**కొల్చారం, మార్చి 27 ప్రభాతవార్త:** ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా సోమవారం అంసానిపల్లి, కొంగోడ్, పోతంశెట్టిపల్లి, నాయిని జలాల్‌పూర్, వెంకటాపూర్ గ్రామాల్లో నియోజకవర్గ కోఆర్డినేటర్ వెంకటరమణ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించి, ఇంటికింటి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిని ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమిష్టి కృషితోనే బ్యాంక్ అభివృద్ధి

**కెనరా బ్యాంక్ జీఎం అనురాధ, డిజిఎం విజయ్‌కుమార్**

**కొల్చారం, మార్చి 27 ప్రభాతవార్త:** సమిష్టి కృషితోనే బ్యాంక్ అభివృద్ధి జరుగుతుందని, తెలంగాణ విభాగం కెనరా బ్యాంక్ జీఎం అనురాధ, డీజీఎం విజయ్ కమార్ అన్నారు. సోమవారం కొల్చారంలో ఆధుని హంగులతో ఏర్పాటు చేసిన నూతన కెనరా బ్యాంక్‌ను రీఓపెనింగ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక బ్యాంక్ మేనేజర్ నీరజ పట్టుదల వల్లే పట్టణ తరహాలో బ్యాంక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రిటైర్డ్ టీచర్ ర్యాగళ్ల వీరయ్య, దశరథ రాములు, సంగమేశ్వర్‌లను బ్యాంక్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. బ్యాంక్‌లో ఏటీఎంతో పాటు లాకర్ ఏర్పాటు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా బ్యాంకుకు వచ్చిన అధికారులు జీఎం అనురాధ, డీజీఎం విజయ్ కుమార్‌లకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రీ, పట్నాయక్, గిమ్య, దుయ్, బిస్ల, నవీర్, బ్యాంక్ మేనేజర్ నీరజ తదితరులు పాల్గొన్నారు.

## గీత పారిశ్రామిక సంఘం నూతన అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్

**అక్కన్నపేట, మార్చి 27, ప్రభాతవార్త :** మండలంలోని గౌరవెల్లి గ్రామంలో సోమవారం రోజున గీత పారిశ్రామిక సంఘం ఎన్నికలను ఆ సంఘం రిటర్నింగ్ అధికారి సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా ఈ ఎన్నికల్లో నూతన గ్రామ అధ్యక్షునిగా మంద శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షునిగా బైరగోని రవిందర్‌గౌడ్‌తో పాటు మరో ఏడుగురిని డైరెక్టర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంతోష్‌రెడ్డి తెలిపారు.

## జాతీయ స్థాయి ఐఎన్ఐ ఒలంపియాడ్ ఫలితాల్లో హుస్నాబాద్ విద్యార్థుల ప్రతిభ

**హుస్నాబాద్, మార్చి 27,ప్రభాతవార్త :** జాతీయస్థాయి ఐఎన్ టిఎస్‌వో ఒలంపియాడ్ లెవెల్ 2 ఫలితాలలో హుస్నాబాద్ పట్టణంలోని శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. సోమవారం పాఠశాలలో ఆయన మాట్లాడుతూ ఫలితాలలో పాఠశాలకు రెండు, మూడు, నాలుగువ బహుమతులు ఒక్కొక్కరు సాధించగా ఐదవ బహుమతి ఇద్దరు విద్యార్థులు సాధించారని వారితోపాటు ఇంకో ముగ్గురివిద్యార్థులకు స్పెషల్ ప్రైజులు, మరో 28 మందికి కన్సోలేషన్ బహుమతులు, 67 మందికి గోల్డ్ మెడల్స్, 80 మంది విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు వచ్చాయని, ఈ ఫలితాలలో 147 మంది విద్యార్థులు అర్హత సాధించడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా అర్హత సాధించిన విద్యార్థు లకు ప్రిన్సిపాల్ స్వయంగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డిఎన్, సతీష్, ఇంచార్జ్ వినయ్, సుమలత, ఉపాధ్యాయులు శ్రీధర్, శ్రీవిద్య, లక్ష్మన్‌రావు, రాజు, మహాలక్ష్మినాయుడు, విజయలక్ష్మి, తిరుపతి పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయ బృందం

# అక్రమ బ్లాస్టింగ్‌తో నేలమట్టం అవుతున్న ఇళ్లు

## బిజెపి ఆధ్వర్యంలో రాస్తారోకో, ధర్నా



మెదక్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

**కొల్చారం, మార్చి 27 ప్రభాతవార్త:** స్టోన్‌క్రషర్‌ల అక్రమ బ్లాస్టింగ్‌వల్ల నివాసగృహాలు నేలమట్టం అవుతున్నాయని, స్టోన్ క్రషర్‌ల నిర్వాహకులు బాధితులకు వెంటనే పరిహారం చెల్లించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు రఘువీరారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు పాతూరి దయాకర్‌గౌడ్ అన్నారు. సోమవారం కొల్చారం మండలపరిధిలోని రాంపూర్ గ్రామంలోని ఇందిరాకాలనీ సమీపంలో మెదక్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు రఘువీరారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాధితుల పక్షాన మండుటెండను సైతం లెక్క చేయకుండా మెదక్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై బీజేపీ నేతలు నిరసన తెలిపారు. దీంతో రహదారికి ఇరువైపులా పెద్దఎత్తున వాహనాలు స్తంభించాయి. ఘటన స్థలానికి స్థానిక ఎస్ఐ సార శ్రీనివాస్‌గౌడ్ చేరుకొని బీజేపీ నేతలను సముదాయించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో బీజేపీ నేతలు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి, దయాకర్‌గౌడ్ మాట్లాడుతూ రాంపూర్ గ్రామంలో అక్రమ బ్లాస్టింగ్‌ల వల్ల ఇందిరా కాలనీలోని గురిగాళ్ల వెంకట్, దుర్గేష్, లింగంలకు సంబంధించిన నివాస గృహాలు నేలమట్టం అయ్యాయని, వారికి నష్ట పరిహారాన్ని క్రషర్ నిర్వాహకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారికి న్యాయం జరిగే వరకు వారి పక్షాన పోరాడతామని నేతలు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో దకం యాదగిరి, కొట్టాల నవీన్, కొడిపల్లి మండల బీజేపీ అధ్యక్షులు రాకేష్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం, అశోక్, నర్సాపూర్‌నియోజకవర్గ ఓబీసీ కన్వీనర్ తోట్ల ఎల్లం, మండల ఉపాధ్యక్షులు జంగంగారి శ్రీకాంత్‌గౌడ్, యువమోర్చా అధ్యక్షులు పంతులు, హరీష్, కిసాన్ మోర్చా అధ్యక్షులు పల్లె రవికాంత్, మైనార్టీ మోర్చా అధ్యక్షులు ఖలీల్, జిల్లా దళిత మోర్చా ఉపాధ్యక్షులు మాదిగ సుధాకర్, మండల కార్యదర్శి నాగరాజు, రాంపూర్ బూత్ అధ్యక్షులు దంకం యాదగిరి, అంసానిపల్లి బూత్ అధ్యక్షులు రవీందర్‌గౌడ్, కిష్టాపూర్ శక్తి కేంద్రం ఇంచార్జి వడ్ల చంద్రశేఖర్, కిష్టాపూర్ బూత్ అధ్యక్షులు సాధుల్లా, ఊశయ్య, ఘనపూర్ బూత్ అధ్యక్షులు మంద మహేష్, బీజేపీ నాయ కులు శివ, నవీన్, శేఖర్, దుర్గయ్య, వెంకటేశం, రాజు, మహిపాల్, రాంపూర్ గ్రామస్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్వకర్మనేతలు

## హుస్నాబాద్ ఉన్నత పాఠశాలలో బొప్పరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి..

**హుస్నాబాద్, మార్చి 27, ప్రభాతవార్త :** జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మాజీ ఎమ్మెల్యే బొప్పరాజు లక్ష్మికాంతారావు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని పూర్వవిద్యార్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ హుస్నాబాద్‌పాఠశాలలో విద్యనభ్యసించి గొప్పవారిగా చరిత్రకెక్కి చిరకాలం నిలిచి ఉండేలా పేరొందిన వారిని కీర్తించుకుంటూ ముందడుగు వేయాని జాగృతి కళాసమితి ప్రదాన కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ, 1992-93బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థి ఎగ్గోజు సుదర్శనాచారి, స్వయంకృషి సేవాసమితి అధ్యక్షులు తిప్పారపు రమేశాచారి, విశ్వకర్మ పరిషత్ మండల ఆర్గనైజర్ సంగోజు భాస్కరాచారి కోరుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుస్నాబాద్ ఉన్నత పాఠశాల ఆరంభించి నేటికి 70ఏళ్ళు పూర్తవుతున్న సందర్భంగా వజ్రోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు చెపుతూ ఈ పాఠశాలలో విద్యనభ్యసించిన తెలంగాణ తొలినాటి స్పీకర్ సిరికొండ మధుసూధనాచారి సైతం హుస్నాబాద్ పాఠశాలలోనే చదువుకున్నారని అలాగే ఇదే పాఠశాలలో చదువుకున్న జాయింట్ కలెక్టర్‌గానూ, అబ్కారీ డిఎస్‌పి, తహశీల్దార్‌గానూ మండల పరిషత్ అభివృద్ధి అధికారులుగానూ ఉన్నత స్థాయిలో ఉన్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ పాఠశాల వజ్రోత్సవాల సందర్భంగా ఈ ప్రాంతానికి ఆద్యుడైన మాజీ శాసనసభ్యులు బొప్పరాజు లక్ష్మికాంతారావు విగ్రహాన్ని ఏర్పాటు చేసి స్మరించుకోవాల్సి న అవసరం ఎంతైనా ఉందని విజ్ఞప్తి చేస్తున్నారు.

## 29న మైనార్టీ రుణాలకు ఇంటర్వ్యూలు

**మనూర్, మార్చి 27, ప్రభాతవార్త:** ఈ నెల 29న మైనార్టీ కార్పోరేషన్ రుణాల కోసం ధరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ షాజీలోద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మనూర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభం అవుతాయన్నారు. ధరఖాస్తు చేసుకున్న లబ్దిదారులు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఎంపిడిఓ సూచించారు.

## వడగండ్ల వానకు నేలబారిన పంటలు

**-పంటలను పరిశీలించిన వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు**

**న్యాల్‌కల్, మార్చి 27, ప్రభాతవార్త:** ఇటీవల ఈదురుగాలులతో, వడగండ్లతో కురిసిన వర్షాలకు నేలబారిన వ్యవసాయ, ఉద్యానవన పంటలను సోమవారం వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు పరిశీలించారు. మండలంలోని దప్పూర్, తాట్‌పల్లి, మిర్జాపూర్(ఎన్) గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పంటలను మండల వ్యవసాయ అధికారి ఎన్ లావణ్య, హార్టికల్చర్ ఏఓ అనూషలు బాధిత రైతులతో కలిసి పరిశీలించారు. మండలంలోని తాట్‌పల్లి గ్రామంలో రైతు మహ్మద్ మైతాబ్ 1.20 ఎకరాల్లో పండించుకుంటున్న ఉల్లిగడ్డ పంటను అధికారులు పరిశీలించారు. మండలంలోని మిర్జాపూర్(ఎన్), డప్పూర్ గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న జొన్న, ఉల్లిగడ్డ పంటలను, డప్పూర్‌లో మామిడి తోటలను అధికారులు పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయని, దెబ్బతిన్న పంటల వివరాల నివేదికలను ఉన్నతాధికారులకు పంపడం జరుగుతుందని అధికారి ఎన్ లావణ్య వివరించారు.



డప్పూర్‌లో దెబ్బతిన్న జొన్న పంటను పరిశీలిస్తున్న అధికారుల

## ఉపాధి హామీ పథకం పనుల రికార్డులపై సామాజిక తనిఖీ

**దుబ్బాక, మార్చి 27, ప్రభాతవాత్త:** మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంకు సంబంధించిన 2019-2022 సంవత్సరం 13వ విడత సామాజిక తనిఖీని దుబ్బాక ఎంపిపి కొత్త పుష్పలతకిషన్ రెడ్డి అధ్యక్షతన సిద్దిపేట జిల్లా డిఆర్‌డిఏ పిడి చంద్రమోహన్‌రెడ్డి, ఏపిడి కౌసల్యదేవిలు కలసి మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంకు సంబంధించిన 32 అంశాలకు సంబంధించిన రికార్డులను ఎస్ఎస్ఏఏటిఆర్‌డిలతో కలసి తనిఖీని దుబ్బాకలో సోమవారం నిర్వహించారు. మండలంలో అన్ని గ్రామాల రికార్డులను క్షుణంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి కడతాల రవిందర్ రెడ్డి, ఏపిడి సంతోష్ కుమార్, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి ప్రభాకర్, ఓబుడ్స్ హరీష్, క్యాసి సంతోష్, ఎస్ఆర్‌పి చెన్నకేషవులు, యాదగిరి, ఎంపిడిఓ భాస్కర శర్మ, ఏపిఓ శ్యాంసుందర్ రెడ్డి, ఈసీ చంద్రయ్య, గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## మిర్జాపూర్‌లో కంటి వెలుగు శిబిరం ప్రారంభం

**న్యాల్‌కల్, మార్చి 27, ప్రభాతవార్త:** తమ కండ్లు ఆరోగ్యంగా ఉండేలా ప్రతి ఒక్కరు కండ్లను పరీక్షించుకోవాలని మండలంలోని మిర్జాపూర్(బి) గ్రామ సర్పంచ్ ఎక్కెల్లి నిర్మలరెడ్డి అన్నారు. సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు రెండవ విడత శిబిరాన్ని సర్పంచ్ నిర్మలరెడ్డి హద్నూర్ సొసైటీ చైర్మన్ ఎక్కెల్లి జగన్నాథ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నిర్మలరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో నిర్వహించే శిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, కండ్ల సమస్యలను దూరం చేసుకోవాల్సి న అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మిర్జాపూర్(బి) ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పిహెచ్ఎన్ శ్యామల, ఎంపిహెచ్ఇఓ మల్కాపురం మల్లికార్జున్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మేదపల్లిలో పంటల పరిశీలన

**ఝరాసంగం, మార్చి 27, ప్రభాతవార్త:** మండలంలోని మేదపల్లి గ్రామంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను గ్రామ సర్పంచ్ పరమేశ్వర్‌పాటిల్‌తో కలిసి మండల వ్యవసాయాధికారి సుకుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న, ధనియాల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. గ్రామంలో వర్షాలతో దెబ్బతిన్న పంటల వివరాలను ఉన్నతాధికారులకు పంపాలని, ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం అందేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్ సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీరణ అధికారి, రైతులు చాకలి హన్మంతి కిష్టయ్య, కొత్తదొడ్డి సంగన్న, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు బాలాజీ గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం

**సదాశివపేట, మార్చి 27, ప్రభాతవార్త:** ఈ నెల 28వ తేదీన పట్టణంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బిఆర్ఎస్ నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు పట్టణంలోని నిజాంపూర్ రోడ్డులోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్, బిఆర్ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఇంచార్జ్ ఎమ్మెల్సీ వెంకట్రామ్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు, బిఆర్ఎస్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు వినతి చేశారు.

## ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి శ్రీకారం

**పాపన్నపేట, మార్చి 27, ప్రభాతవార్త:** పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయ పరిసరాల్లో ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి సోమవారం భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు సాయిబాబ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో 2 కోట్ల రూపాయలతో భవనాన్ని నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు అల్లుడు కృష్ణ, బోయిని కుటుంబరావు తదితరులు ఉన్నారు.

## మల్గిలో రూ.10 లక్షలతో సిసి రోడ్డు పనులు

**న్యాల్‌కల్, మార్చి 27, ప్రభాతవార్త:** మండలంలోని మల్గి గ్రామంలో ఎఉంజిఎన్ఆర్ఎస్ పథకంలో 10 లక్షల రూపాయలతో సిసి రోడ్డు నిర్మాణానికి సోమవారం శ్రీకారం చుట్టినట్లు గ్రామ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు మారుతి యాదవ్ పేర్కొన్నారు. గ్రామంలో సోమవారం పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. గ్రామాభివృద్దే లక్ష్యంగా గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు శివానంద శ్రీపతి, వార్డు సభ్యులు విఠల్, సిద్దారెడ్డి, మాజీ సర్పంచ్ భూమారెడ్డి, నాయకులు దాదా సలీం, మాణిక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆరోగ్యం కోసమే 'ఆరోగ్యలక్ష్మి' : ఎంపిపి

**కొండపాక, మార్చి 27, ప్రభాతవార్త :** సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావులు మహిళాల ఆరోగ్యం కోసం ఆరోగ్యలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని ప్రతి మంగళవారం మహిళాలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఎంపిపి ర్యాగల్ల సుగుణ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల సర్వ సభ్య సమావేశం ఆమె అధ్యక్షతన నిర్వహించారు. వివిధ శాఖల నివేదికలను అధికారులు చదివి వినిపించారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో తిరిగి పంటలను పరిశీంచామని తెలిపారు. ఆయిల్ ఫామ్ పంటను ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. కొండపాక పిహెచ్‌సిలో 24 గంటల వైద్య సౌకర్యం కోసం అధికారులు చర్యలు తీసుకోవాలని వెలికట్ట ఎంపిటిసి సాయి బాబా కోరారు. ఎండకాలంలో తాగునీటి సమస్య, విద్యుత్, ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకొని ప్రభుత్వనికి చెడ్డ పేరు రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపిపి ఉపాధ్యక్షుడు, ఎంపిటిసిల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ అధికారులకు సూచించారు. సాగు నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితులున్నాయని తపాస్‌పల్లి రిజర్వాయర్ ద్వారా సాగు నీటిని అందించే విదంగా చర్యలు తీసుకోవాలని మర్పడ్గ ఎంపిటిసి అంజనేయులు సభ దృష్టికి తీసుకొచ్చారు. వెలకట్ట క్రాస్ రోడ్డులో ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని బస్‌స్టాఫ్, మరుగుదొడ్లను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని వెలికట్ట ఎంపిటిసి, సర్పంచ్‌లు ఆర్టీసి అధికారులను కోరారు. కుకునూరుపల్లి వైద్యాధికారి బల్‌బీర్ సింగ్ మాట్లాడుతూ ఎండ కాలంలో వడ దెబ్బ తగలకుండా తీసుకొవాల్సి న చర్యలను వివరించారు. కార్యక్రమంలో రెండు మండలాల తహసీల్దార్‌లు రామేశ్వర్, అశాజ్యోతి, ఎంపిడిఓ రాంరెడ్డి, రైతు సమితి మండల కో అర్డినేటర్ ర్యాగల్ల దుర్గయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభంలో కుకునూరుపల్లి మాజీ ఎంపిటిసి పొల్కంపల్లి యాదగిరి మృతికి సంతాపం ప్రకటించి, కొంతసేపు మౌనం పాటించారు. ఎంపిపి మాట్లాడుతూ మహిళాల ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యమన్నారు. ప్రతి ఒక్క మహిళ తప్పని సరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా వార్డును గెలుచుకున్న దమ్మక్కపల్లి సర్పంచ్‌ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.



జిల్లా సాయిలో అవార్డును పొందిన దమ్మక్కపల్లి సర్ప ంచ్‌ను సన్మానిస్తున్న నాయకులు



బహుమతులు అందుకుంటున్న విద్యార్థుల దృశ్యం

## అంతర్జాతీయ చిత్ర లేఖనంలో గురుకుల విద్యార్థుల ప్రతిభ

**హుస్నాబాద్ రూరల్, మార్చి 27, ప్రభాతవార్త :** హుస్నాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇటీవల ముంబయ్ వారు నిర్వహించిన (రంగోత్సవ్ సెలబ్రేషన్ ) కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ చిత్రలేఖ నం పోటీలు నిర్వహించగా ఈ కార్యక్రమంలో 11 మంది విద్యార్థులు బహు మతులు సాధించినట్లు ఆ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సోమ వారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉపేంద్రకు కార్టున్ మేకింగ్‌లో 3వ స్థానంలో నిలవగా, విష్ణు వర్ధన్, రామ్‌చరణ్, ఎమ్ రామ్‌చరణ్, జయప్రకాష్, అక్షయ్, బి.రిషి, కే విజ్ఞేశ్వర్, బి వంశీ, ఉపేంద్ర, హర్షవర్ధన్‌లకు పలు కేటగిరీల్లో బహుమతులు సాధించినట్లు తెలిపారు. ఒకే పాఠశాల నుండి 11 మంది విద్యార్థులు ప్రతిభ చూపి బహుమతులు సాధించగా ఆ పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్‌కి ది హైయస్ట్ ఫేర్ ఫామెన్ అవార్డు ఇన్ ద వరల్డ్ అని పాఠశాలకు ప్రధానం చేసారన్నారు. అంతేకాకుండా పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయునికి ఇండియన్ ఆర్ట్స్ మాస్క్ అవార్డు అందజేసినట్లు తెలిపారు.

## నేడు గజ్వేల్‌లో నిరసన దీక్ష : మాదాడి జశ్వంత్‌రెడ్డి



మాట్లాడుతున్న టిపిసిసి డెలిగేట్ సభ్యుడు మాదాడి జశ్వంత్‌రెడ్డి

**గజ్వేల్, మార్చి 27 (ప్రభాతవార్త):** రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడం ప్రధాని మోడి అహంకారానికి నిదర్శనమని టిపిసిసి డెలిగేట్ సభ్యుడు మాదాడి జశ్వంత్‌రెడ్డి విమర్శించారు. సోమవారం జశ్వంత్‌రెడ్డి నివాసంలో ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడం ద్వారా బిజెపి పతనం ప్రారంభమైందన్నారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేటుకు నిరసనగా 28వ తేదీన గజ్వేల్‌లోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఒకరోజు నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొన్యాల బాలకృష్ణారెడ్డి, మండల మైనార్టీ అధ్యక్షుడు అజ్గర్, కృష్ణారెడ్డి, నర్సంపల్లి నాగరాజు, దేవేందర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

**మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం**

గజ్వేల్ మండలం అక్కారం గ్రామంలో ఇటీవల మరణించిన కుమ్మరి సైదయ్య కుటుంబాన్ని సోమవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, టిపిసిసి డెలిగేట్ సభ్యుడు మాదాడి జశ్వంత్‌రెడ్డి పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. ఆయన వెంట కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కొన్యాల బాలకృష్ణారెడ్డి, కాంగ్రెస్ మైనార్టీసెల్ మండల అధ్యక్షుడు అజ్గర్, కాంగ్రెస్ నాయకుడు కృష్ణారెడ్డి, నాగరాజు, దేవేందర్, అక్కారం యాదగిరి, కోనాపూర్ యాదగిరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## పౌష్టికాహారంతోనే తల్లిబిడ్డల ఆరోగ్యం : ఎంపిటిసి



మాట్లాడుతున్న ఎంపిటిసి శ్రీనివాస్

**అక్కన్నపేట, మార్చి 27, ప్రభాతవార్త :** పౌష్టికాహారంతోనే తల్లిబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపిటిసి లింగాల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని రామవరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో జయశ్రీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోషకపక్షం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపిటిసి శ్రీనివాస్ మాట్లాడుతూ బాలింతలు, చిన్నపిల్లలు, గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిడిపివో సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## దుబ్బాక ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షం ర్యాలీ

**దుబ్బాక, మార్చి 27, ప్రభాతవాత్త:** దుబ్బాక పట్టణ కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఐసిడిఎస్ కార్యాలయం నుండి తెలంగాణ తల్లి విగ్రహ వరకు సిడిపిఓ చంద్రకళ, అంగన్‌వాడి సూపర్‌వైజర్లు అనురాధ, విజయలక్ష్మి, అంతుల్, గిరిజ, రాజేశ్వరి, స్వరూప, రేణుకలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కలసి పోషణ పక్షం ర్యాలీని సోమవారం నిర్వహించారు. ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఓ చంద్రకళ అధ్యక్షతన నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్ పర్సన్ గన్నె వనితభూంరెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలతకిషన్ రెడ్డి, జడ్పిటిసి కడతాల రవిందర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ దేవుని లలితచంద్రయ్యలు ముఖ్యాతిదులుగా హాజరైనారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నపిల్లలు పోషకాలతో కూడిన అహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా జీవించాలన్నారు. బాలికల్లో రక్తహీనత సమస్య నివారణకు ఐరన్, పాలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకుకోవాలన్నారు. మార్చి 20 నుండి ఎప్రిల్ 3 వరకు నిర్వహిస్తున్న పోషణ పక్షంలో భాగంగా దుబ్బాక ప్రాజెక్టు పరిధిలో అన్ని అంగాన్ వాడి కేంద్రాల్లో ప్రతి అంగన్‌వాడి టీచర్, ఆయాలు కార్యక్రమాన్ని విజయవంత చేయాలన్నారు. పోషకవిలువలతో కూడిన ఆహార పదార్థాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటప్రసాద్, దుబ్బాక బ్లాక్ కోఆర్డినేటర్ శ్యామ్సున్, ఐసిడిఎస్ సిబ్బంది, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం

**సదాశివపేట, మార్చి 27, ప్రభాతవార్త:** కంది మండలం మామిడిపల్లి గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న శ్రీ నల్ల పోచమ్మ ఆలయ నిర్మాణానికి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పులిమామాడి రాజు తన వంతుగా 25వేల రూపాయలను విరాళంగా అందచేశారు. ఆలయ నిర్మాణానికి కృషి చేస్తున్న మాల సోదరులు ఆలయ నిర్మాణానికి సహకరించాలని పులిమామిడి రాజు దృష్టికి తేగా వెంటనే స్పందించిన రాజు 25 వేల నగదును కంది మండల కన్వీనర్ జంగన్న చేతుల మీదుగా అందచేశారు. కార్యక్రమంలో పిఎంఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు.

## సెంట్రింగ్ కర్రలు కూలి వ్యక్తి మృతి

**అక్కన్నపేట, మార్చి 27, ప్రభాతవార్త :** సెంట్రింగ్ కర్రలు కూలి మరణించిన సంఘటన అక్కన్నపేట మండలం కట్కూర్‌గ్రామంలో జరిగింది. మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనుల్లో భాగంగా ట్యాంక్ పైకి నిర్మాణ సామాగ్రి తీసుకెల్తున్న క్రమంలో సెంట్రింగ్ కర్రలు కూలి ఇద్దరు కూలీలు ట్యాంక్ పై నుండి కిందపడగా ఇందులో ఒక్కరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో వ్యక్తిని కరీంగనర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన కూలీ ఒంగోలు జిల్లాకు చెందిన ఎలుకూరి రవిందర్‌రెడ్డి (30)గా స్థానికులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మిగతా కూలీలు ఆసుపత్రి వద్దకు చేరుకుని అంతసేపు తమతో పనిచేసిన రవిందర్‌రెడ్డి విగతజీవిగా మారడంతో కన్నీటి పర్యంతరమయ్యారు. ఈ విషయంపై మృతుని సహోదరుడు వెంకటేశ్వర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తాండ్ర వివేక్ తెలిపారు.



మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న దృశ్యం

## శానిటేషన్‌లో జెపితండాకు ప్రథమ బహుమతి

**నంగునూర్, మార్చి 27, ప్రభాతవార్త :** మంత్రి సహకారంతో జేపీ తండా గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నామని సర్పంచ్ భూక్యా బిక్షపతినాయక్ అన్నారు. అదివారం జిల్లా కేంద్రంలోని విపంచి ఆడిటోరియంలో క్లీన్ అండ్ గ్రీన్ శానిటేషన్ విభాగంగా ఉత్తమ గ్రామ పంచాయతీగా అవార్డు మంత్రి హరీష్‌రావు, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేపీతండా గ్రామం జిల్లాకే అదర్శంగా నిలిచిందన్నారు. అవార్డులు రావడానికి సహకారం అందించిన మాజీ ఎంపిపి జాప శ్రీకాంత్‌రెడ్డి, జడ్పీటిసి తడిసిన ఉమా, ఎఎంసి చైర్మన్ రాగుల సారయ్యచ అయిల్ ఫామ్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎడ్ల సోమిరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్లు మహిపాల్‌రెడ్డి, రమేష్‌గౌడ్, రైతుబంధు అధ్యక్షులు కిష్టారెడ్డి, ఎంపిటిసి ఎడ్ల జ్యోస్న నర్సింహ్మారెడ్డి, బిఅర్ఎస్ మండల అధ్యక్షులు లింగంగౌడ్, డీపీఓ, డీఎల్‌పిఓ,ఎంపిడిఓలకు గ్రామ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

## నిరసన దీక్షను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్‌ను అవిష్కరిస్తున్న దృశ్యం

**బెజ్జంకి, మార్చి 27, ప్రభాతవార్త :** రెడ్డి కార్పోరేషన్ సాధనకై వచ్చే నెల 11న జిల్లా కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన నిరసన దీక్ష కార్యక్రమానికి రెడ్డి సంఘం నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని రెడ్డి జెఎసి జిల్లా అధ్యక్షులు ఐలేని మల్లికార్జున్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం వీరాపూర్ గ్రామంలో రెడ్డి జెఎసి ఆధ్వర్యంలో 11న చేపట్టనున్న దీక్ష కార్యక్రమం వాల్ పోస్టర్‌ను అవిష్కరించి మాట్లాడారు. బిఆర్ఎస్ సర్కారు ఎన్నిక ముందు రెడ్డి కార్పోరేషన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. రెడ్డి సామాజిక వర్గంలో ఎంతో మంది పేదవారు ఉన్నారని ప్రభుత్వం పథకాలు అందడం లేదన్నారు. రెడ్డికార్పోరేషన్ సాధించేవరకు విశ్రమించమన్నారు.కార్యక్రమంలో రెడ్డి జెఎసి నాయకులు రాంలింగారెడ్డి, లక్ష్మారెడ్డి, ముత్యలరెడ్డి,దేవేందర్‌రెడ్డి, విష్ణువర్దన్‌రెడ్డి, ముక్కిస రత్నాకర్‌రెడ్డి, చెన్నారెడ్డి, లక్ష్మారెడ్డి, కర్ణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఇతర రాష్ట్రాలకు ఆదర్శం 'కంటి వెలుగు'

### జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజాశర్మ



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న జడ్‌పి చైర్‌పర్సన్ రోజాశర్మ

**చిన్నకోడూరు, మార్చి 27, ప్రభాతవార్త :** 'కంటి వెలుగు' ఇతర రాష్ట్రాలకు అదర్శంగా నిలుస్తుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వేలేటీ రోజాశర్మ అన్నారు. మండల పరిధిలోని మల్లారం గ్రామంలో సోమవారం ఆమె ఎంపిపి కూర మాణిక్యరెడ్డితో కలిసి కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగు పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి వెలుగు శిబిరంలో అవసరం ఉన్న వారికి ఉచితంగా కంటి అద్దాలు, మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కొండం వనితరవీందర్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్‌లు ములకల కనకరాజు, సదానందంగౌడ్, ఎంపిడిఓ శ్రీనివాస్,సర్పంచ్ జ్యోతి అంజనేయులు, ఎంపిటిసి బాలయ్య, బిఅర్ఎస్ నాయకుల మధుసూదన్ రెడ్డి, ఎంపిఒ సోమిరెడ్డి, ఉప సర్పంచ్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## రేగులపల్లికి ఉత్తమ ఆరోగ్య గ్రామ పంచాయతీ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న దృశ్యం

**బెజ్జంకి, మార్చి 27, ప్రభాతవార్త :** ఉత్తమ ఆరోగ్య గ్రామ పంచాయతీగా మండల పరిధిలోని రేగులపల్లి గ్రామం ఎంపికైంది. అదివారం మంత్రి హరీష్‌రావు, ఎంపి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటీ రోజాశర్మ, ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ జిల్లాస్థాయి పురస్కారాన్ని రేగులపల్లి గ్రామ సర్పంచ్ జెల్ల ఐలయ్య, పంచాయతీ పాలకవర్గ సభ్యులకు జిల్లా స్థాయి ఉత్తమ అరోగ్య గ్రామ చైర్మన్ పంచాయతీ పురస్కారం ప్రధానం చేశారు. ఉత్తమ అరోగ్య గ్రామంగా తీర్చిదిద్దడంలో సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ ప్రజలకు సర్పంచ్ ఐలయ్య కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు లింగాల నిర్మల,కనగండ్ల కవిత, కో-ఆప్షన్ సభ్యులు పాకాల మహిపాల్‌రెడ్డి, ఎంపిడిఓ దమ్మని రాము, ఎంపిటిసి రాజమహేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

### రామాయంపేట రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం...

## మళ్లీ ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలు

**రామాయంపేట, మార్చి 27, ప్రభాతవార్త :** రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణ వాసులు రిలే నిరాహార దీక్షలు సోమవారం ప్రారంభించారు. గతంలోనూ చాలా రోజులపాటు ఉద్యమం చేసి, మరొకసారి ఉద్యమబాట పట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఒక వెలుగు వెలిగిన రామాయంపేట నేడు కనుమరుగవుతున్న దశకు చేరుకున్నది కాబట్టి తిరిగి పునర్వైభవం రావాలంటే రెవెన్యూ డివిజన్ ఏర్పాటే ఏకైక మార్గమని, పట్టణవాసులు అందరూ అనుకొని ఈరోజునుండి రిలేనిరాహార దీక్షలు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వము వెంటనే స్పందించి రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోచమ్మల అశ్విని శ్రీనివాస్, సుంకోజు దామోదర్, రేవెళ్లి వినయ్‌సాగర్, మాసాయిపేట మల్లేశం, ఎనిశెట్టి అశోక్‌లు ఈరోజు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు.




రిలే నిరాహార దీక్ష చేస్తున్న దృశ్యం

# దేశానికే ఆదర్శం 'కంటివెలుగు' : ఎమ్మెల్యే



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రసమయి

**బెజ్జంకి, మార్చి 27, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న కంటి వెలుగు పథకం దేశానికే అదర్శమని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటీ రోజాశర్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి చికిత్సల అనంతరం కంటి అద్దాలు అవసరం ఉంటే వెంటనే ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే బాలకిషన్, జిల్లా పరిషత్ చైర్మన్ రోజాశర్మను సర్పంచ్ బోయినపల్లి నర్సింగరావు శాలువాతో సత్కరించారు.

### ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా పరిషత్ చైర్మన్

కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ రోజాశర్మ గ్రామంలో ఉన్న ప్రభుత్వ అరోగ్య కేంద్రాన్ని సందర్శించి మంత్రి తన్నీరు హరీష్‌రావు ప్రత్యేక నిధులతో చేపట్టిన నూతన అసుపత్రి నిర్మాణపనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలన్నారు. అమె వెంట ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు లింగాల నిర్మల, కనగండ్ల కవిత, కచ్చు రాజయ్య, పాకాల మహిపాల్‌రెడ్డి, బోయినపల్లి నర్సింగరావు, నల్లగొండ లక్ష్మీ, ఉప సర్పంచ్ మమత, బోయినపల్లి శ్రీనివాస్‌రావు, లక్ష్మణ్, తిరుపతి, దీటి రాజు, శ్రీకాంత్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## కళాకారుల పొట్టలు కొడుతున్న సారథి కళాకారులు

### నిరుద్యోగ ఉద్యమ కళాకారుడు వొళ్ళపు స్వామి

**నిజాంపేట, మార్చి 27, ప్రభాతవార్త :** డిపిఆర్ఓ ఆధ్వర్యంలో పనిచేస్తూ పౌరసంబంధాల శాఖలో జీతాలు తీసుకుంటూ టీఆర్ఎస్ పార్టీ మరియు ఇతర ప్రైవేట్ ప్రోగ్రాంలలో పాటలు పాడుతూ ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని నిరుద్యోగ ఉద్యమ కళాకారుడు వొళ్ళపు స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు తెలంగాణ కోసం పల్లెపల్లె తిరిగి పాటలు పాడి ఉద్యమం చేసిన కళాకారులకు చేసుకుందామంటే పనుల దొరుకక బార్య పిల్లలను సాదుకోలేక ఎన్నో అవస్థలు పడుతూ, ఆకలి చావులతో అల్లాడుతున్న తరుణంలో ఒకమైపు సాంస్కృతిక సారదిలో ప్రభుత్వం నుండి నెల నెల వేతనం తీసుకుంటూ మళ్లీ వివిధ పార్టీల ప్రచారంలలో కూడా డైరెక్ట్‌గా డబ్బులు తీసుకొని ప్రోగ్రాంలు చేస్తూ నిరుద్యోగ కళాకారుల జీవితాల్లో మట్టి కొట్టడం సరికాదని, ప్రైవేటు ప్రోగ్రాంలు చేస్తుండగా సంబంధిత శాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. సోమవారం రోజున నిజాంపేట మండల కేంద్రంలో జరిగిన బారాస ఆత్మీయ సమ్మేళనం పార్టీలో సారథి కళాకారులు ఎలా ప్రోగ్రాం చేస్తున్నారు సంబంధిత అధికారులు సమాధానం చేప్పాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో నిరుద్యోగ కళాకారులం అందరం ఏకమయ్యి పెద్దఎత్తున ఆందోళనలు చేసి, డిపిఆర్ఓ కార్యాలయ్యాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

## వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్

**చిన్నశంకరంపేట, మార్చి 27, ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టాలని ఎమ్మార్పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ తెలిపారు. మార్చి 2న ఆదిలాబాద్‌నుండి ప్రారంబమైన మాది సంఘాల సంగ్రామ యాత్ర సోమవారం మండల పరిధి ఖాజాపూర్, శాలీపేట మీదుగా చిన్న శంకరంపేటకు చేరుకుంది. వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా మాట్లాడి, అధికారంలోకి రాగానే మాటమార్చిందన్నారు. ఇప్పటికైన బిజెపి ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సి వర్గీకరణ బిల్లు అమలులో లేకపోవడం వల్ల విద్యా,ఉద్యోగ రంగాల్లో ఎస్సీలకు అన్యాయం జరుగుతుందన్నారు. వచ్చే ఏప్రిల్ 4న జరుగుతున్న బాగ్యనగర ముట్టడికి మాదిగ ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాస్, స్వామి, రాములు, శ్రీనివాస్, రాజు, సాగర్ నర్సింలు, శంకర్‌లు పాల్గొన్నారు.

## కవి చరణ్‌సాయిదాస్‌కు ఘన సత్కారం



చరణ్‌సాయిదాస్‌ను మెమోంటోతో సత్కరిస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, మార్చి 27, ప్రభాతవార్త :** హైదారాబాద్ మినిస్టర్స్ క్లబ్‌లో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, మహానగర జలమండలి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జల కవితోత్సవ కవి సమ్మేళనంలో నీటి పొదుపు, జలశుద్ధీ, జలరక్షణ, వనసంరక్షణలపై కవిత చదివినందుకు సిద్దిపేట పట్టణానికి చెందిన వేముల శ్రీ వేమన శ్రీచరణ్ సాయిదాస్‌కు ఉత్తమ కవితకు గానూ శాలువతో సత్కరించి మెమోంటో సర్టిఫికెటు అందించారు. కార్యక్రమంలో గున్న రాజేందర్‌రెడ్డి, చైర్మన్ గాంధీజ్ ఇన్ ప్రతిష్టాన్, సత్యనారాయణ జలమండలి, సిహెచ్ విద్యాసాగర్, యానాం ప్రభాకర్‌రెడ్డి, గోపాల్, గిరిధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

**కొండపాక, మార్చి 27, ప్రభాతవార్త :** తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన చింతల కిష్టవ్వకు రూ॥ 60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర ్పంచ్ మల్లమారి రవీందర్, మాజీ సర్పంచ్ బాలబ్రహ్మం, మాజీ ఉప సర్పంచ్ వంగ శ్రీనివాస్, అత్మ కమీటి డైరెక్టర్ సున్నం భాస్కర్, వార్డు సభ్యులు గాండ్ల కనకసేన, కూరెళ్ల పూల్లారెడ్డి, ఉన్నత పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ బాల్‌రాజ్, నాయకులు సార్ల కనకయ్య, సాదుపల్లి యాదగిరి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## 'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

### -ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

**వర్గల్, మార్చి 27 (ప్రభాతవార్త):** సిఎం కెసిఆర్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామాల్లో ఉన్న ప్రతి ఒక్క వ్యక్తి సద్వినియోగం చేసుకోవాలని ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని జబ్బాపూర్ గ్రామంలో ఏర్పాటుచేసిన కంటివెలుగు శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి చూపు ఎంతో ముఖ్యమైనదని, కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నల్ల నర్సవ్వ, ఉపసర్పంచ్ రాజు, ఎంపిపి లతారమేష్‌గౌడ్, ఎంపిటిసి శ్యామలపాదుల్లాగౌడ్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేలూరి వెంకట్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు నాగరాజు, నాయకులు మల్లేశం, వైద్యులు, గ్రామ ప్రజలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



జబ్బాపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

## నేడు సహస్ర హనుమాన్ చాలీసా పారాయణం

**రామాయంపేట, మార్చి 27, ప్రభాతవార్త :** రామాయంపేట విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నేడు శ్రీ సహస్ర హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విహెచ్‌పి జిల్లా అధ్యక్షుడు పబ్బ సత్యనారాయణ పేర్కొన్నారు అందుకు అట్టి ఏర్పాట్లను పరిశీలించారు. విహెచ్‌పి ఆధ్వర్యంలో 5వేల మందితో హనుమాన్ చాసా పారాయణం చేయబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాంస్కృతికకార్యక్రమాలు, 108 దంపతులతో యజ్ఞ నిర్వహణ, హనుమాన్ పూజ, ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపకులు, గీతా గాన ప్రవచన ప్రచార కర్త బ్రహ్మశ్రీ ఎల్.వి.గంగాధర శాస్త్రి, వివిధ మఠాధిపతులు, స్వామీజీలు విచ్చేస్తున్నారని ఆయన తెలిపారు. అలాగే ఈ కార్యక్రమానికి హనుమాన్ గురుస్వాములు, వేలాది హనుమాన్ మాలాధారులు, హనుమాన్‌భక్తులు, పిల్లలు, పెద్దలు, యువతీ యువకులు, విద్యార్థినీ, విద్యార్థులు, మహిళలు అందరూ కలిసి ముక్త కంఠంతో హనుమాన్ చాలీసను పారాయణం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ధర్నాను విజయవంతం చేయండి

**చిన్నశంకరంపేట, మార్చి 27, ప్రభాతవార్త:** నేడు(28 మంగళవారం) భాగ్యనగరంలోని ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు రమేష్ చారి, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ చారి ఉపాధ్యాయులకు సోమవారం పిలుపునిచ్చారు. వారు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు.ప్రతి నెల ఒకటో తేదినే వేతనాలు చెల్లించాలని, ఎయిడెడ్ అధ్యాపకుల, కాంట్రాక్టు అధ్యాపకుల గౌవర అధ్యాపకుల పెండింగ్ జీతాలు చెల్లించాలని, ప్రభుత్వ కళాశాలలకు రీపాట్రియేట్ చేయబడిన ఎయిడెడ్ కళాశాల అధ్యాపకులకు ఆరు నెలల నుండి పెండింగ్‌లో ఉన్న జితాలను చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

## సైబర్ నేరాలపట్ల అవగాహన అవసరం : ఎఎస్ఐ

**చిన్నశంకరంపేట,మార్చి 27, ప్రభాతవార్త:** సైబర్ నేరాల పట్ల విద్యార్థులకు అవగాహన అవసరం అని ఏఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని మేరి మాత ప్రవేటు పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ప్రజలు తమ వ్యక్తిగ బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్‌లకు వచ్చే సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాటిని స్పందించకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ చేసే అవకాశం ఉంటుందన్నారు. ఇటీవల కాలంలో మహిళలు, పిల్లలను టార్గెట్ చేసుకోని సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, అంతర్జాలాన్ని పరిమితికి మించి వాడకూదన్నారు. సైబర్ నేరగాళ్లు రోజుకో రీతిలో ప్రజలను మోసం చేసి డబ్బులను కాజేస్తున్నారన్నారు. సైబర్ నేరగాళ్లు మాయమటాలు చెప్తూ బహుమతులు వచ్చాయని, లాటరీ తగిలిందని, లోన్లు ఇస్తామని ఇతరత్రా ఆశ చేపి ఆన్‌లైన్ ద్వారా డబ్బులను కాజేస్తారని తెలిపారు. ఇటువంటి సందేశాలకు స్పందించరాదని సూచించారు.

## పాఠశాలలను సందర్శించిన సెక్టోరియల్ అధికారి



వెరిఫికేషన్ చేస్తున్న సెక్టోరియల్ అధికారి

**కోహెడ, మార్చి 27, ప్రభాతవార్త :** మండలంలోని నాగసముద్రాల, బస్వాపూర్ గ్రామాలలో గల ప్రభుత్వ పాఠశాలను సెక్టోరియల్ అధికారి రంగనాథ్ సోమవారం సందర్శించారు. ఎంఈవో పావని అధ్వర్యంలో జిల్లా ప్రజాపరిషత్ పాఠశాల, తెలంగాణ అదర్శ పాఠశాల, నాగసముద్రాల కేజీబీవీ, మండల ప్రజా పరిషత్ బస్వాపూర్ పాఠశాలలను సెక్టోరియల్ అఫీసర్ రంగనాథ్ సందర్శించి యుడైస్ వెరిఫికేషన్ చేశారు. అనంతరం పదో తరగతి స్పెషల్ క్లాసుల ప్రయోజనం విద్యార్థులతో ముచ్చటించి తగిన సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో పిజిహెచ్ఎం వేణుకుమార్, మెడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, కేజీబీవీ స్పెషల్ అఫీసర్ హిమబిందు, ఎంపిపిఎస్ బస్వాపూర్ హెచ్ఎం దేవేందర్‌రావు, సీఆర్‌పి నిర్మల పాల్గొన్నారు.

## మాజీ ఎంపిటిసి మృతి

**కొండపాక, మార్చి 27, ప్రభాతవార్త :** కుకునూరుపల్లి మాజీ ఎంపిటిసి పొల్కంపల్లి యాదగిరి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతు సోమవారం మృతి చెందాడు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎంపిటిసిల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, మండల రైతు బంధు సమితి కో అర్డినేటర్ దుర్గయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పార్టీనాయకులు, అత్మ కమీటి డైరెక్టర్‌లు, మాజీ సర్పంచులు పరామర్శించి, ప్రగాడ సానుభూతిని తెలిపారు.

## గ్రామస్తులు కంటి పరీక్షలు చేయించుకోవాలి : సర్పంచ్

**కొండపాక, మార్చి 27, ప్రభాతవార్త :** కంటి చూపు సమస్యలను గుర్తించి వాటిని నిరవారించడానికి ప్రభుత్వం కంటి వెలుగు 2వ ధపా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని సర్పంచ్ మిట్టపల్లి వసంత రుషి అన్నారు. సోమవారం కోనాయిపల్లిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. గ్రామ ప్రజలందరు కంటి సమస్యలుంటే గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఆవసరమైన వారికి కంటి అపరేషన్‌లు ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని వివరించారు. కంటి వైద్య శిబిరాన్ని గ్రామ ప్రజలందరు సద్వినియోగం చేసుకొవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యురాలు స్నేహ, డిఈఓ సౌజన్య, ఎఎన్ఎం నాగలక్ష్మి, ఉపసర్పంచ్ పిట్ల రమేష్, కార్యదర్శి కృష్ణ, అంగన్‌వాడి టీచర్లు, అశా వర్కర్లు, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ వసంత రుషి

## పాఠశాలలో బాలిక కిషోర పక్షోత్సవాలు

**నంగునూర్, మార్చి 27, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని నంగునూర్ ప్రాథమిక పాఠశాలలో సోమవాం బాలిక కిషోర పక్షోత్స వాల్లో భాగంగా ప్రతిజ్ఞ చిరుధాన్యాల ఉపయోగంపై కార క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి కోలా సునీత మహేందర్‌గౌడ్ పాల్గొని మాట్లాడారు. బాలికలు, మహిళలు రక్తహీనత నిర్మూలించడానికి చిరుధాన్యాలు వంకాయ, బెల్లంపట్టి, గుడ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. రక్తహీనతను తగ్గించడానికి పుష్టికరమైన అహారం ఐరన్‌తో కూడుకున్న అహారం భోజనం చేసేలాగా ప్రతి రోజు కోడి గుడ్డును తినేలాగా బాలికలను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.డి.తహసీన్ సుల్తానా, కనకయ్య, కోలా శ్రీనివాస్, మల్లేశం, రామకృష్ణ, వెంకటేశం, పరమేశ్వర్, అంగన్‌వాడీ టీచర్లు తోట పద్మ, రాజమల్లవ్వ, లక్ష్మి, విమల,రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన పిఎసిఎస్ చైర్మన్

**బెజ్జంకి, మార్చి 27, ప్రభాతవార్త :** మండలపరిధిలోని వీరాపూర్ గ్రామానికి చెందిన మిట్టపల్లి నాగిరెడ్డి ఇటీవల మృతి చెందగా సోమవారం బాధిత కుటుంబీకులను పిఎసిఎస్ చైర్మన్ తన్నీరు శరత్‌రావు పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట పిఎసిఎస్ వైస్ చైర్మన్ బండి రమేష్, నాయకులు చెన్నారెడ్డి, లక్ష్మారెడ్డి, రమణారెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు

**జగదేవ్‌పూర్, మార్చి 27 (ప్రభాతవార్త):** బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని స్థానిక సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రాచర్ల నరేష్, ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షుడు కావ్యదర్గయ్య అన్నారు. మండల పరిధిలోని చాట్లపల్లి గ్రామంలో యువకులు వి.బాలకిషన్, బరిగె సాయి, ఎం.అనిల్, బరిగె తిరుపతి, అనిల్‌ల ఆర్థిక సహకారంతో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సోమవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలంలో బాటసారుల దాహం తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయిబాబా, మాజీ ఎంపిటిసి సావిత్రినర్సింలు, గ్రామ యువకులు అయిలయ్య, బాలకృష్ణారెడ్డి, సత్యనారాయణ, భూమోళ్ళ రాజు, వేముల కనకయ్య, కొంతం శ్రీకాంత్, ఎగుర్ల కనకయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## బస్‌షెల్టర్ నిర్మాణానికి భూమిపూజ



శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

**జగదేవ్‌పూర్, మార్చి 27 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని చాట్లపల్లి గ్రామంలో సోమవారం బస్‌షెల్టర్ నిర్మాణానికి సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రాచర్ల నరేష్ మండల ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు కావ్యదర్గయ్య, కొండపోచమ్మ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఎక్బాల్‌తో కలిసి భూమిపూజ చేశారు. అదేవిధంగా గ్రామంలో అంబేద్కర్, శివాజీ విగ్రహాల ఏర్పాటుకు కొబ్బరికాయలు కొట్టి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటివరకు బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని గమనించి ఈరోజు బస్‌షెల్టర్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సయ్యద్ అజాం, గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఎగుర్ల కనకయ్య, రైతుబంధు మండల ఉపాధ్యక్షుడు దేశాయ్‌రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు బి.ఈదులు, బరిగె భాస్కర్‌ముదిరాజ్, రాజు, జె.రాజు, లింగం, గ్రామ యువకులు సత్యనారాయణ, బాల్‌రాజ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయండి

**కొల్చారం, మార్చి 27 ప్రభాతవార్త:** పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ ఈనెల 28వతేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంగయ్య, వెంకట్‌రామిరెడ్డి, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ యాదగిరి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రంలో ఉపాధ్యాయుల వేతనాలు నిబంధనల మేరకు ఒకటవ తేదీన చెల్లించాలని, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని చేస్తున్న విజ్ఞప్తులన్నీ నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, దీని వల్ల ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, బ్యాంక్ లోన్లు సకాలంలో చెల్లించలేక పెనాల్టీలు, అధిక వడ్డీలు కడుతున్నారని తెలిపారు. జీపీఎఫ్ లోన్లు, పార్ట్ ఫైనల్లు చెల్లించకబడక నెలల తరబడి ఎదురు చూపులు తప్పడం లేదని, కొత మందికి ఏడాది దాటినా అకౌంట్లలో డబ్బులు జమ కావడం లేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన అన్ని రకాల బిల్లులను ఆర్థిక సంవత్సరం ముగిసేలోపే క్లియర్ చేయాల్సి ఉంటుందని, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో కొన్ని వేల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెండింగ్ బిల్లుల విడుదల కోసం రోజూ ఆఫీసు చుట్టూ తిరుగుతున్నారన్నారు. మరో 5 రోజుల్లో 2022-23 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నప్పటికి పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులు ఉపాధ్యాయుల అకౌంట్లలో జమకాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే నిధులు విడుదల చేయాలని ఇందిరా పార్క్ వద్ద 5 వేల మంది ఉపాధ్యాయులతో యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శనలు, ధర్నా న్విహించడం జరుగుతుందన్నారు. కావున ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రదర్శనలో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

## అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

**నిజాంపేట, మార్చి 27, ప్రభాతవార్త :** అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. నిజాంపేట ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సౌడా యాదగిరి(38) ఆదివారం రాత్రి సమయంలో అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడని తెలిపారు. మృతుని భార్య మమత ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

**రాయపోల్,మార్చి 27 ప్రభాతవార్త :** జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండల పరిధిలోని తిమ్మక్కపల్లిలో గ్రామంలో చోటు చేసుకుంది. రాయపోల్ ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం తిమ్మక్కపల్లి గ్రామానికి చెందిన ఇప్ప మల్లేశం (42) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి సంసారం విషయంలో అప్పుడప్పుడు ఇంట్లో తన బార్యతో గొడవలు జరిగేవి.అదివారం రోజు తన బార్యతో గోడవ పడగా అదే రోజు అతని బార్య పుట్టింటికి వెళ్లింది. రాత్రి 9గంటల సమయంలో అతను అన్నం తిని పడుకున్నాడు. ఉదయం లేచి చూసే సరికి ఇంట్లో లేకపోవడంతో చూట్టు ప్రక్కల వేతకగా తమ పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకొని చనిపోయి ఉన్నాడు.మృతుని తల్లి ఇప్ప నర్సవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న 4 ట్రాక్టర్ల పట్టివేత

**నంగునూర్, మార్చి 27, ప్రభాతవార్త :** అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్న సంఘటన అదివారం రాత్రి చోటు చేసుకుంది. రాజగోపాల్‌పేట ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అదివారం రాత్రి మండల పరిధిలోని అక్కన్నపల్లి పెద్ద వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను అర్ఐ ఇచ్చిన సమాచారం మేరకు పట్టుకొని పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. తదుపరి చర్య నిమిత్తం తహశీల్దార్‌కు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.



అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసిన దృశ్యం




సిపిఆర్ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు

## సిపిఆర్ ప్రక్రియపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

**మంత్రి హరీష్‌రావు**

**సంగారెడ్డి, మార్చి 27, ప్రభాతవార్త:** సిపిఆర్ ప్రక్రియపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, సమయం, సందర్భం, వయస్సుతో నిమిత్తం లేకుండా ఎవరికైనా సడెన్ కార్డియాక్ అరెస్ట్ వచ్చే అవకాశం ఉంటుందని ఆ సమయంలో సిపిఆర్ చేయగలిగితే ప్రాణాలు రక్షించే అవకాశం 50 శాతం మెరుగవుతుందని రాష్ట్ర ఆర్థిక,వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి మంత్రి హరీష్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ ప్రాణానష్టాన్ని తగ్గించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా సిపిఆర్‌పై అవగాహన కల్పించాలని, శిక్షణ ఇప్పించాలని నిర్ణయించారు. ప్రతి ఒక్కరు సడెన్ కార్డియాక్ అరెస్టు, హార్ట్ అటాక్ రెండింటికి తేడా తెలుసుకోవాలన్నారు. మనిషి సడెన్‌గా షాక్‌కు, ఒత్తిడికి లోనైనప్పుడు సడెన్ కార్డియాన్ అరెస్ట్ అవుతుందని, అప్పటికప్పుడే మనిషి కుప్పకూలిపోయి శ్వాస ఆగిపోతుందని వైద్య నిపుణులు తెలుపుతున్నారన్నారు. ఆ సమయంలో గుండె కొట్టుకునేలా ఛాతి మీద పదే పదే ఒత్తిడి చేయడం, నోటి ద్వారా కృత్రిమ శ్వాసను అందించడం వల్ల గుండె, ఊపిరితిత్తులు తిరిగి పని చేసి మనిషి బ్రతుకుతారని దీన్నే సిపిఆర్ అంటారని మంత్రి తెలిపారు. అదే విధంగా ప్రజల్లో సిపిఆర్‌పై అవగాహన కల్పించే విధంగా, సిపిఆర్‌తో ప్రాణాలు కాపాడినట్టి జరిగిన సంఘటనల కథనాలు ప్రచురించాలని జర్నలిస్టులు ఇందులో భాగస్వాములు కావాలని మంత్రి కోరారు. ప్రజాప్రతినిధులకు, ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి సిపిఆర్‌పై శిక్షణ కల్పించాలని కలెక్టర్‌కు సూచించారు. అనంతరం సిపిఆర్ శిక్షణకు సంబంధించిన కరపత్రాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ మంజుశ్రీ జయపాల్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ డా.శరత్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పొగాకు ఉత్పత్తుల వాడకం హానికరం

**-జిల్లా పొగాకు నియంత్రణ విభాగం సూపర్‌వైజర్**

**న్యాల్‌కల్, మార్చి 27, ప్రభాతవార్త:** పొగాకు ఉత్పత్తుల వాడకం (సిగరేటు, బీడి తాగడం, పాన్ మసాల, జరదా తినడం, గుట్కా తినడం) తొ ఆరోగ్యాలు ఆసుపత్రుల పాలు కావడం తధ్యమని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, గ్రామంలోని బస్టాండు ఆవరణలో ప్రజలకు పొగాకు వాడకంతో కలిగే కష్టనష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వాడకంతో మనషుల్లో హైపర్ టెన్షన్, నోటి క్యాన్సర్, శ్వాస కోస, గుండె సంబందిత వ్యాదులు సంక్రమిస్తాయన్నారు. బహిరంగ ప్రదేశాల్లో పొగతాగితే సెక్షన్ 4 ప్రకారం నేరం అని, 2 వందల రూపాయల జరిమానా విధిస్తారన్నారు. పొగాకు ఉత్పత్తుల ప్రచారంకు పోస్టర్ల వేయడం సెక్షన్ 5 ప్రకారం నేరమని, 2 సంవత్సరాల జైలు శిక్షకు బాధ్యులవుతారన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సూచనల మేరకు జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సచ్చినంద్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, డాక్టర్ మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫసల్వాది పంచాయతీకి జిల్లాస్థాయి అవార్డు



ఫసల్వాది సర్పంచ్‌కు ఆవార్డు అంజేస్తున్న మంత్రి హరీష్‌రావు

**సంగారెడ్డి మున్సిపాలిటి మార్చి 28,ప్రభాతవార్త:** జాతీయ పంచాయతీ ఆవార్డులలో సంగారెడ్డి మండలం ఫసల్వాది గ్రామపంచాయతీ జిల్లాస్థాయి ఉత్తమపంచాయతీ ఆవార్డుకు ఎంపికైంది.. సోమవారం సంగారెడ్డి సమీపంలోని జిఆర్‌కె ఫంక్షన్‌హల్‌లో జరిగిన జిల్లాస్థాయి అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీష్‌రావు ముఖ్యఅతిథిగా హజరై అవార్డులను ఆయా గ్రామాల సర్పంచ్‌లకు అందజేశారు.దీన్‌దయాల్ ఉపాధ్యా పంచాయత్ సతత్ వికాస్ పుస్కార్, జాతీయ పంచాయతీ అవార్డులు 2021,22 అవార్డులకు సంగారెడ్డిజిల్లాలోని 27గ్రామపంచాయతీలు ఎంపికయ్యాయి.అందులో సంగారెడ్డి మండలం ఫసల్వాది గ్రామపంచాయతీ ఎంపికైంది.ఉత్తమ పంచాయతీ ఆవార్డును మంత్రి హరీష్‌రావు, గ్రామపంచాయతీ సర్పంచ్ నిర్మలదేవి, ఎంపిటిసి శారదాసుధాకర్‌రెడ్డిలకు శాలువాలతో సన్మానించి, ఆవార్డులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎ.శరత్,ఆదనపు కలెక్టర్ వీరారెడ్డి,రాష్ట్రచేనేత అబివృద్ధి సంస్థ ఛైర్మెన్ చింతప్రభాకర్,జడ్పీ ఛైర్‌పర్సన్ మంజూశ్రీజైపాల్‌రెడ్డి,డిసిసిబి వైస్ ఛైర్మెన్ పట్నం మాణిక్యం, జడ్పీ కో అప్షన్ సభ్యులు ఎం.డి.ముస్తఫా, డిసిఎమ్మెస్ ఛైర్మెన్ శివకుమార్, గ్రంథలయ సంస్థ ఛైర్మెన్ నరహరిరెడ్డి,సిడిసి ఛైర్మెన్ బుచ్చిరెడ్డి, మాజీ జెడ్పిటిసి మనోహర్‌గౌడ్,వార్డు సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్కేమురిలో అఖండ హరినామ సప్తహా

**కంగ్టి, మార్చి 27, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎన్కేముడి గ్రామంలో సోమవారం అఖండ హరినామ సప్తహా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పోచమ్మ, కేశమ్మ, లక్ష్మీమాత ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో ప్రతి సంవత్సరం అఖండ హరినామ సప్తహా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అఖండ హరినామ సప్తహా కార్యక్రమానికి గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని చిన్నారులు దేవతల వేషాధారణతో చూపరులను ఆకట్టుకున్నారు. ఉత్సవాలను పుపరస్కరించుకుని గ్రామానికి చెందిన మహిళలు తమ ఇండ్ల నుంచి నిండు కళశాలతో ఊరేగింపుగా ఆలయానికి భజనలు చేస్తూ ఉండగా చిన్నారులు దేవతల వేషాదారణతో ఊరేగింపులో పాల్గొనడం ఆక్టుకుంది. గ్రామ కమిటి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు (అన్నదానం) నిర్వహించారు.



దేవతల వేషాధారణలో చిన్నారుల దృశ్యం

# కార్యకర్తలే పార్టీకి అండాదండ : ఎమ్మెల్యే



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

**పటాన్‌చెరు, మార్చి27 ప్రభాతవార్త:** కార్యకర్తలే పార్టీకి అండాదండ అని, వారి సహకారంతోనే నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని, ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గుండెల నిండా ఆశీర్వదించాలని, మాయమాటలు చెప్పే ప్రతిపక్ష పార్టీలకు కర్రు కాల్చి వాత పెట్టాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాల కార్యక్రమాల్లో భాగంగా సోమవారం జిన్నారం మండల స్థాయి ఆత్మీయ సమ్మేళన సమావేశాన్ని గడ్డ పోతారంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన జిన్నారం నుండి గడ్డ పోతారం వరకు వందలాది బైక్‌లతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి ఘన స్వాగతి పలికి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. గజమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వేదికపై పూల వర్షం కురిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరుల స్థూపానికి, తెలంగాణ తల్లి చిత్రపటాలకు ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పార్టీ శ్రేణులకు దిశ దశను నిర్దేశించారు. 2001 నుండి నేటి వరకు భారత రాష్ట్ర సమితి పటిష్టతకు, అభివృద్ధికి సైనికుడి వలె కృషి చేస్తున్న ప్రతి కార్యకర్తలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ముందు జిన్నారం మండలం ఏ విధంగా ఉండేది.. నేడు ఎలా ఉందో గమనించాలని ప్రజలను కోరారు. 9 ఏళ్ల పాలనలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఆర్థిక అభ్యున్నతికి కృషి చేస్తున్నామని తెలిపారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా బీఆర్ఎస్ పార్టీలో పని చేస్తున్న ప్రతి కార్యకర్తలకు రెండుల రూపాయల ప్రమాద భీమా అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని, సంక్షేమ పథకాలను గడప గడపకు చేరవేస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేయాలని కార్యకర్తలను కోరారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ప్రతీ కార్యకర్తలు సిద్ధం కావాలని, ఎప్పుడు ఎక్కడ ఏసమస్య ఎదురైనా 24 గంటలు తాను అందుబాటులో ఉంటానని తెలిపారు. ఆత్మీయ సమ్మేళనానికి ఘన స్వాగతం పలికిన ప్రతి ఒక్కరికి ఆయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోను పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేష్‌గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ పంచాయితీ పాలకవర్గ సభ్యులు, వివిధ స్థాయిల ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, పార్టీ మండల అధ్యక్షులు రాజేష్, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



జ్వాలాముఖి ఆలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి హరీష్‌రావు

## కేంద్రంలో బిజెపికి రోజులు దగ్గరపడ్డాయి

**మంత్రి హరీష్‌రావు**

**కంగ్టి, మార్చి 27, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండలంలోని తడ్కల్ ఎడ్ల రేగడి తండాలో నూతనంగా నిర్మించిన జ్వాలాముఖి ఆలయాన్ని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు నారాయణఖేడ్ శాసన సభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఆలయంలో జ్వాలాముఖి అయమ్మవారితో పాటు కౌలు బాబ, రాంసింగ్ బాబా, మాన్‌సింగ్ బాబా విగ్రహాలను వేద మంత్రాలు వల్లిస్తూ ప్రతిష్టాపన చేశారు. ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి చేరుకున్న మంత్రి, ఎమ్మెల్యేలను గిరిజనులు తమ సాంప్రదాయ పద్దతిలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ కేంద్రంలోని భారతీయ జనతా పార్టీకి రోజులు దగ్గర పడ్డాయని, వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే అన్నారు. గత పాలకుల హయాంలో గిరిజనులు పడ్డ కష్టలు వర్ణణాతీతమని, తాగునీటి కోసం కోసుల దూరం పోయి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉండేదని, కేసీఆర్ పాలనతో ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారన్నారు. గతంలో వ్యవసాయం చేసేందుకు రైతులు రోదనలు పడ్డారని, ఎప్పుడు కరెంటు వస్తుందో ఎప్పుడు పోతుందే తెలియని పరిస్థితి ఉండేదని, ఇప్పుడు రౌండ్ ద క్లాక్గఆ నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడంతో పాటు సాగునీలి సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. కరోనా కష్టాలు పెట్టిన తెలంగాణలో ఏ సంక్షేమ పథకాలను ఆపలేదని గుర్తు చేశారు. త్వరలనే న్యూట్రీషన్ కిట్‌ను ప్రారంభించనున్నట్లు వివరించారు. తండాకు 25లక్షల రూపాయలను రెండు రోజుల్లో భవనాల నిర్మాణాలకు మంజూరు చేయనున్నట్లు ప్రజల హర్షధ్వానాల మధ్య మంత్రి ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, ఎంపిపి అధ్యక్షులు సంగీతరెడ్డి, జడ్పీటిసి సభ్యులు కోట లతిత, గ్రామ సర్పంచ్ ఊపావతఖ బళిరాం, గిరిజన మహిళా అధ్యక్షులు చీమని బాయి, ఆలచ అర్చకులు మంగళచరండ్ మహారాజ్, జవహర్ సింగ్ మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన

**-ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు**



అభయాంజనేయ విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**రామచంద్రాపురం, మార్చి 27, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు దైవ చింతనతో రోజులు గడపుకోవాలని పటాన్‌చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీశ్రీశ్రీ అభయాంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్దలతో సోమవారం నిర్వహించారు. ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుఅయి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేను ఆలయ కమిటి బాధ్యులు గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లలితా సోమిరెడ్డిడ, వైస్ చైర్మన్ రాములు గౌడ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ నల్లపోచమ్మ ఆలయ అర్చకులు నగేశ్‌కు అవార్డు

**మనూర్, మార్చి 27, ప్రభాతవార్త:** మండలంలోని బోరంచ గ్రామంలో కొలువున్న శ్రీ నల్లపోచమ్మ ఆలయ అర్చకులు యస్ నాగేష్ స్వామి వైదిక పురోహిత రత్న అవార్డును అందుకున్నారు. హైద్రాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళానిలయం సాంస్కృతిక సంఘం సేవా సంస్థ ఆధ్వర్యంలో నాగేశ్ స్వామికి ఉగాది నంది పురస్కారం అందచేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ సముద్రాల వేణుగోపాల చారి, తెలంగాణ రాష్ట్ర టూరిజం శాఖ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, జ్యోతిష్య పండితులు బ్రహ్మశ్రీ కొడకండ్ల శివరామ శర్మ, బ్రహ్మశ్రీ శివ కార్తిక్ శాస్త్రిలు ఆలయ అర్చకులు నాగేష్ స్వామిని శాలువాతో సత్కరించి పురస్కారాన్ని అందచేశారు.




నాగేశ్‌స్వామికి అవార్డును అందచేస్తున్న దృశ్యం



దంపతులకు సతత్ వికాస్ పురష్కారం అందచేస్తున్న ఆర్థిక మంత్రి హరీష్‌రావు

## హుసెల్లి సర్పంచ్‌కు సతత్ వికాస్ పురస్కారం

**న్యాల్‌కల్, మార్చి 27, ప్రభాతవార్త:** దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాన్ని మండలంలోని హుసెల్లి గ్రామ సర్పంచ్ సుధారాణి వెంకట్‌రెడ్డి ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు చేతుల మీదుగా సోమవారం అందుకున్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుధారాణి వెంకట్‌రెడ్డి దంతపులకు మంత్రి శాలువాలతో సత్కరించి పురస్కారాన్ని అందచేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ శరత్, జిల్లా పరిషత్ చైర్మన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ అనిషబేగం, పంచాయితీ కార్యదర్శులు నాగభూషణం, ఎంపిఓ సురేష్, ఎఎన్ఎం లలిత, అంగన్‌వాడి టీచర్ సిద్ధమ్మ, ఆశావర్కర్ భారతి పాల్గొన్నారు.

## పులిగుర్తుకు ఓటేద్దాం-సమస్యలను పరిష్కరించుకుందాం

**-జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు తూర్పు నిర్మిలరెడ్డి**




ఎంఆర్ఎఫ్ కార్మికులకు సూచనలు చేస్తున్న తూర్పునిర్మిలరెడ్డి

**సదాశివపేట, మార్చి 27, ప్రభాతవార్త:** కార్మికులకు అండగా ఉండే కేపీఎస్, బికెఎస్ బలపర్చిన అభ్యర్థి చంద్రశేఖర్‌కు మద్దతు పలికేందుకు పులిగుర్తుకు కార్మికులు ఓటు వేయాలని సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తూర్పు నిర్మలరెడ్డి అన్నారు. పట్టణ శివారులోని ఎంఆర్ఎఫ్ కర్మాగార యూనియన్ ఎన్నికలను పురష్కరించుకుని ఆదివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో పట్టణంలోని బొంబాయి టాకీస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రచార సభలో నిర్మలరెడ్డి, ప్రభాకరన్‌లు పాల్గొని కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ చంద్రశేఖర్‌కు బలపరిస్తే 75వేల వేతన ఒప్పందం, గ్రూపులు లేకుండా సర్వీస్ అల్వెన్స్, గ్రాటివిటీకి అధనంగా 2లక్షల సాధించడం, పదవీ విరమణ వయసు 60సంవత్సరాలకు పెంచడం, మంచి అగ్రిమెంట్ చేయడం, ప్రొడక్షన్ కార్మికులతో ఇంజనీరింగ్ ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ వర్కర్లకు సైతం ఇన్సెంటీవ్‌ను, క్యూరింగ్‌కు లింకు చేయడానికి కృషి, వీడిఎ సర్వీసును సవరించి డబ్బు పెంచడానికి కృషి సల్పుతామన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్మికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని పెద్దగొల్ల చంద్రశేఖర్‌కు కేటాయించిన పులి గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో విజయతీరంకు చేర్చాలని కార్మికులకు వారు సూచించారు. కొత్తగొల్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ మాయమాటలు చెప్పే నాయకులు మాటలకు మోసపోకుండా కార్మికులకు అండగా ఉండే తన పులిగుర్తుకు ఓటేసి గెలిపించాలని, మెనిఫోస్టోలో పేర్కొన్న హామీలన్నీ పరిష్కరించడం తధ్యమన్నారు. కార్యక్రమంలో బికెఎస్ ధనరాజన, తెలంగాణ జన సమితి కమిటీ జిల్లా అధ్యక్షులు తుల్జారెడ్డి, బిఎస్‌కే కృష్ణంరాజు, మల్లేశం, విఠల్, నారాయణ తదితర కార్మికులు పాల్గొన్నారు.

## జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలికి సన్మానం



జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు తూర్పు నిర్మలారెడ్డిని సన్మానిస్తున్న కౌన్సిలర్

**సదాశివపేట, మార్చి 27, ప్రభాతవార్త:** జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, సంగారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్ రెడ్డి సతీమణి తూర్పు నిర్మలా రెడ్డిని సదాశివపేట మున్సిపల్ 19వ వార్డు కౌన్సిలర్ పట్లూరి నాగరాజుగౌడ్ ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని తూర్పు నిర్మలరెడ్డి నివాస గృహంలో సోమవారం నిర్మలరెడ్డి జన్మదినాన్ని పురష్కరించుకుని శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మునిపల్లి సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ రాయపాటి రమేష్, తుకారం, మహిళా నాయకులు ఆకుల శోబ, స్వరూప, పద్మ తదితరులు పాల్గొన్నారు.

### భోజనానికి ముందు బాదములు తినాలి

బాదములపై చేసిన రెండు నూతన అధ్యయనాలు ఒక అధ్యయనాన్ని మూడు రోజుల పాటు చేయగా మరో అధ్యయనాన్ని మూడు నెలల పాటు నిర్వహించగా అవి బాదాములవల్ల కలిగే ప్రయోజనాలను వెల్లడించాయి.ఈ అధ్యయనాలు వెల్లడించే దాని ప్రకారం ప్రీ డయాబెటీస్ మరియు అధిక బరువు, ఊబకాయంతో బాధపడు తున్న ఆసియన్ భారతీయులలో మూడు నెలలపాటు నిత్యం బాదములు తీసుకోవ డం వల్ల వారిలో ప్రీ డయాబెటిస్ పూర్తిగా తగ్గడం లేదా గ్లూకోజ్ స్థాయిలు నియంత్రించబడటం జరిగింది.



మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న నీలం మధు

## ఉత్తమ గ్రామ పంచాయతీగా పురస్కారం అందుకున్న చిట్కుల్ గ్రామం

**పటాన్‌చెరు, మార్చి27 ప్రభాతవార్త:** జాతీయ దీన్ దయాళ్ ఉపాద్యాయ పంచాయితీ సతత్ వికాస్ పురస్కారంలో ఉత్తమ పంచాయితీగా చిట్కుల్ గ్రామం ఎన్నికైనందున సర్పంచి నీలం మధు ముదిరాజ్ మంత్రి హరీష్‌రావు, జిల్లా పాలనాధికారి కలెక్టర్ డా. శరత్‌ల చేతుల మీదుగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ముఖ్యమంత్రి ఆశయాల మేరకకు గ్రామ ప్రజలు పాలకవర్గం, శేయోభిలాషుల ప్రోత్సాహంతోనే సాధ్యమైందని, ఇది నా ఒక్క విజయం కాదని, సమిష్టి విజయం అని, నిరంతరం అందరూ తన వెంటే కలిసి వస్తే మరిన్ని విజయాలు సాధిస్తానని నీలం మధు ముదిరాజ్ తెలిపారు. నియోజకవర్గంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు ఎప్పుడు మందుంటానని, అలాగే మంత్రి కేటీఆర్ ఆశించిన అభివృద్ధి కేసీఆర్ నేతృత్వంలో ఆశించిన విధంగా చేసేందుకు నాకు అందరూ సహకారం అందించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీవో సురేష్ మోహన్, జిల్లా అధికారులు, జెడ్పీటీసీ సుప్రజా వెంకట్‌రెడ్డి, ఎంపీపీ సుష్మ శ్రీ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీవో హరిప్రసాద్, ఎంపీడీవో బన్సీలాల్, గ్రామ కార్యదర్శి కవిత, ఉప సర్పంచి విష్ణువర్ధన్‌రెడ్డి, వార్డు సభ్యులు దుర్గయ్య, భుజంగం, శ్రీను, మురళీ, రాజు, వెంకటేషన, గోపాల్, అనిల్, శ్రీను, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## ఎకరాకు 20,000వేల నష్టపరిహారం అందించాలి

**మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీరాజ్**



సమావేశంలో మాట్లాడుతున్న పృథ్వీరాజ్

**మునిపల్లి, మార్చి 27 ప్రభాతవార్త:** భారీ వర్షాలకు, వడగళ్ల వానకు నష్టపోయిన రైతులకు ఎకరాకు 20,000వేల నష్టపరిహారం అందించాలని తెలంగాణ మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ అన్నారు. సోమవారం పృథ్వీరాజ్ ఆధర్వంలో మల్లారెడ్డిపేట్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు రాష్ట్రంలో మక్కలు, జొన్న, ఉల్లి, శనగ, కూరగాయలు, మామిడితో పాటు వివిధ రకాల పంటలు నష్టపోయాయన్నారు. ఎకరాకు రూ.50 వేల పెట్టుబడి పెట్టి పంటలు సాగుచేసినా భారీ ఎత్తున నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం కేసిఆర్ ఎకరాకు రూ.10వేల నష్టపరిహారం అందిస్తామని ప్రకటించారు. అయినా అధికారులు మాత్రం 33 శాతం అందిస్తామని తెలిపారు. రైతులందరికీ నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాంరెడ్డి, బసంత్, సంగారెడ్డి, నాగిరెడ్డి, విజేందర్‌రెడ్డి, అజిమొద్దీన్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో కానుకుంట రోడ్డుకు మోక్షం

**గుమ్మడిదల, మార్చి 27, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన గుమ్మడిదల నుండి కానుకుంట వరకు సోమవారం డబుల్ రోడ్డు నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ డబుల్ రోడ్డు నిర్మాణం వల్ల ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధికి నోచుకోవడం జరుగుతుందన్నారు. ఇక్కడి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి కుమార్‌గౌడ్, ఎంపిపి సద్ది ప్రవీణ, గుమ్మడిదల గ్రామ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి, ఉపసర్పంచ్ దాకూరి మొగులయ్య, గుమ్మడిదల గ్రామ పాలకవర్గ సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఈనెల 29న సంగారెడ్డిలో జాబ్‌మేళ

**సంగారెడ్డి, మార్చి 27, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని జిల్లా ఉపాధి కార్యాలయం పాత వెలుగు ఆఫీసు నందు ఈనెల 29 బుధవారం రోజున జాబ్‌మేళ నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధి అధికారి ఎ.వందన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుస్థిరా ఇన్‌ఫ్రా ప్రాజెక్టు కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతందన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఎంబిఏ చదివిన నిరుద్యోగులు వయస్సు 18 నుంచి 28 సంవత్సరాల లోపు ఉండాలని, నెలకు రూ.15 వేల నుంచి 18 వేల వరకు ఇవ్వడం జరుగుతుందన్నారు. మొత్తం ఖాళీలు 50 ఉన్నట్లు పేర్కొన్నారు. 29న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని, అసక్తిగల నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే

**జహీరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** విద్యుత్ షాక్‌తో తిరిగిరాని లోకాలకు చేరిపోయిన వ్యక్తుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సోమవారం ఆర్థిక సహాయం అందచేశారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వ్యక్తులు గతంలో విద్యుత్ షాక్‌తో అనంత లోకాలకు చేరిపోయారు. బాధిత కుఉటుంబ సభ్యులు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చెక్కులు అందచేశారు. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ముల్లానీ బాషా, మహమ్మద్ అబ్దుల్ అజీజ్‌లు కరెంట్ షాక్‌తో మృతి చెందారు. ఇదిలా ఉండగా విద్యుత్ షాక్‌తో మృతి చెందిన మూగజీవాల యజమానులకు సైతం ఎమ్మెల్యే ఆర్థిక సహాయం చేశారు. మృతి చెందిన ఇరువరు కుటుంబ సభ్యులకు 5 లక్షల రూపాయల చొప్పున 10 లక్షలు, మూగజీవాలను సాకుతున్న 5 మంది యజమానులు మామిడ్గికి చెందిన మచకూరి ముక్తార్, మన్నాపూర్‌కు చెందిన షకీల్ మియా, హోతి(కె) గ్రామానికి చెందిన ముంగి ఎల్లమ్మ, ధనసిరి గ్రామానికి చెందిన షకీర్ మక్సుబ్, మల్చల్మ గ్రామానికి చెందిన ముల్లవాల చాంద్ పాషాలకు 40వేల రూపాయల చొప్పున 2లక్షల రూపాయల పరిహారాన్ని ఎమ్మెల్యే ప్రభుత్వ పరంగా చెక్కులను ఎమ్మెల్యే అందచేశారు.




చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే